PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 175 | విజయవాడ, శుక్రవారం 27 జనవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 27 January 2023 | Rs

విజయవాడలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

రిపబ్లిక్ డే వేడుకలను తిలకిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈజిప్టు అధ్యక్షులు అబ్దుల్ ఫతా, ప్రధాని మోడీ, కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు

ఘణతంత్రం

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

దేశ వ్యాప్తంగా రిపబ్లిక్ డే వేడుకలు

రాష్ట్రంలో పతాకావిష్కరణ చేసిన గవర్నర్

ఢిల్లీ : దేశ వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. దేశ రాజధాని ఢిల్లీతో పాటు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ ఈ సందర్భంగా జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయపతాకాన్ని ఆవిష్కరించి, త్రివిధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. రాష్ట్రపతి హోదాలో ద్రౌపది ముర్ము గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ఇదే ప్రథమం. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్‌సిసి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. త్రివిధ దళాలు నిర్వహించిన కవాతు స్ఫూర్తి దాయకంగా సాగింది. దేశీయ సైనిక పాటవాన్ని కళ్లకు కట్టేలా ఆర్మీ అనేక విన్యాసాలను ప్రదర్శించింది. ఉదయం పదన్నరకు ఎర్రకోట వద్ద ప్రారంభమైన కవాతు కర్తవ్యపథ్‌మీదుగా ఎర్రకోట వరకు సాగింది. వణికించే చలిలోనూ పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నగరవాసుల హర్షధ్వానాల మధ్య సైనిక దళాలు కవాతు చేశాయి. అర్జున్ ట్యాంకులు, నాగ్ మిసైల్ వ్యవస్థలు, బిఎంపి -2 వాహనాలు, లద్దాఖ్ స్కౌట్ రెజిమెంట్‌కు చెందిన క్విక్ రియాక్షన్ పోరాట వాహనాలు, కె-9 వజ్ర ట్యాంకులు, బ్రహ్మోస్ 816, షార్ట్ స్పాన్ బ్రిడ్జి వాహనాలు, ఆకాశ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను సైన్యం ప్రదర్శించింది. ఒకదాని తరువాత ఒకటిగా కవాతులో ఈ వాహనాలు వెడుతున్నప్పుడు ఆ ప్రాంతం కరతాళధ్వనులతో మారుమ్రోగింది. త్రివర్ణపతాకాలను ప్రజలు ప్రదర్శించారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన యుద్ధ ట్యాంకులు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈజిప్టు నుండి వచ్చిన 120 మంది సైనికుల ప్రత్యేకదళం కూడా ఈ కవాతులో పాల్గొనడం విశేషం. వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా 17 శకటాలను ప్రదర్శించారు. చాలా సంవత్సరాల తరువాత ఆంధ్రప్రదేశ్ శకటానికి ఈ సారి రిపబ్లిక్‌డే పరేడ్‌లో స్థానం లభించింది. 'ప్రభల తీర్థం.. మకరసంక్రాంతి వ్యవసాయ దారుల పండుగ' ఇతివృత్తతంతో రూపొందించిన ఈ శకటం ఆకట్టుకుంది. రాష్ట్రంలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

● లోపలి పేజీలో.. ●

'ప్రభల తీర్థం.. మకరసంక్రాంతి వ్యవసాయ దారుల పండుగ' ఇతివృత్తతంతో ఆంధ్రప్రదేశ్ శకటం

హెచ్‌సియులో ఉద్రిక్తత

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బిబిసి డాక్యుమెంటరీ ప్రదర్శన

కాశ్మీర్ ఫైల్స్ ప్రదర్శనకు ఎబివిపి యత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎబివిపి విద్యార్థి సంఘం కవ్వింపు చర్యలతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు)లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గురువారం గణతంత్ర దినోత్సవం రోజున ఎబివిపి నాయకులు వర్సిటీ యాజమాన్యం అనుమతి లేకుండా క్యాంపస్‌లో కశ్మీర్ ఫైల్స్ సినిమా ప్రదర్శనకు ప్రయత్నించడంతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, పలువురు విద్యార్థులు అభ్యంతరం తెలిపారు. దీంతో క్యాంపస్‌లో గందరగోళం నెలకొంది. హెచ్‌సియు వైస్ ఛాన్సలర్ మెతకవైఖరి కారణంగానే ఎబివిపి నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు క్యాంపస్‌లో నిరసనకు దిగారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు వర్సిటీ ప్రధాన గేటు ముందు కూర్చొని విసికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్ అప్ సోషలిజం..డౌన్ డౌన్ క్యాప్టలిజం..అంటూ నినదించారు. కాగా, బుధవారం రాత్రి క్యాంపస్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రధాని మోడీపై బిబిసి రూపొందించిన 'ఇండియా - ది మోడీ క్వశ్చన్' డాక్యుమెంటరీని ప్రదర్శించారు. చలిలో సైతం పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై తిలకించారు. తాజా పరిణామాల నేపథ్యంలో విద్యార్థి సంఘాల నేతలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హెచ్‌సియులో బిబిసి డాక్యుమెంటరీ చూస్తున్న విద్యార్థులు

రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే దేశభక్తికి ప్రతీక

● సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

● లోపలి పేజీలో.. ●

ఛత్తీస్‌గడ్ యువతకు నిరుద్యోగ భృతి

రాయపూర్ : తమ రాష్ట్రంలోని యువతకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి నిరుద్యోగ భృతిని ఇవ్వనున్నట్లు ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ ప్రకటించారు.బస్తర్ జిల్లా జగదల్‌పూర్‌లోని లాల్‌బాగ్ పరేడ్ మైదానంలో గురువారం గణతంత్రదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. ప్రతి నెల నిరుద్యోగ భృతిని చెల్లిస్తామని చెప్పిన ఆయన ఎంత మొత్తాన్ని ఇస్తారన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. 2018 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఈ మేరకు హామి ఇచ్చినప్పటికీ వివిధ కారణాల రీత్యా అమలుకు నోచుకోలేదు.

తాజాగా ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం గమనార్హం. నిరుద్యోగ భృతితో పాటు కార్మికులకు గృహ నిర్మాణ పథకం, మహిళలు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడేందుకు ప్రత్యేక పథకాలను కూడా ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

ప్రపంచ వృద్ధి 1.9 శాతమే..!

● ఐక్యరాజ్య సమితి అంచనా

● లోపలి పేజీలో.. ●

రైతు వెన్ను విరుస్తున్న కేంద్రం

● ట్రాక్టర్ ర్యాలీలో వక్తలు
● రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రైతుల వెన్ను విరుస్తోందని పలువురు రైతు నాయకులు విమర్శించారు. కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడానికి నిరసిస్తూ దేశ వ్యాప్త కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గురువారం ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహించారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు, వ్యవసాయ కార్మికులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మీసాల రాజారావు వంతెన నుండి బయలుదేరిన ర్యాలీ బిఆర్‌టిఎస్ రోడ్డులోని పడవల రేవు వరకూ సాగింది. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయడం ద్వారానే రైతాంగానికి ఊరట లభిస్తుందన్నారు. ఆవిషయం తెలిసినా మోడీ ప్రభుత్వం అమలుకు అంగీకరించకపోవడం రైతులను వంచించడమేనన్నారు. కేంద్రానికి భిన్నంగా కేరళ ప్రభుత్వం రైతాంగానికి బాసటగా నిలుస్తోందని పేర్కొన్నారు.. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో వ్యవసాయానికన్నా రెట్టింపు ఆదాయం పారిశ్రామికవేత్తలకు వచ్చేదని, ఇప్పుడు అది 12 రెట్లకు పెరిగిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ మద్దతు ధరలు, రుణమాఫీ, పంటల బీమా, పెన్షన్ చట్టాల సాధనకు జాతీయ స్థాయిలో పోరాటం అనివార్యమని తెలిపారు. ఎఐకెఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ రైతుల ఆందోళన నేపథ్యంలో రైతులపై పెట్టిన కేసులు నేటికీ ఉపసంహరించుకోలేదని, అశువులు బాసిన రైతుల కుటుంబాలకు ఇంతవరకు న్యాయం చేయలేదని తెలిపారు. సిఐటియు నాయకులు సుధాకరరావు మాట్లాడుతూ కేంద్రం మెడలు వంచాలంటే రైతులు, కార్మికుల ఉమ్మడి పోరాటం అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐకెకెఎంఎస్ నాయకులు గిరీష్, ఎఐకెఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, ఎఐకెఎం నాయకులు హరినాథ్, రైతు కూలీ సంఘం నాయకులు వీరబాబు, ఎఐకెఎఫ్ నాయకులు ఎం.వెంకటరెడ్డి, జెఎస్ఆర్ నాయకులు మరీదు ప్రసాదు, తెలుగు రైతు నాయకులు గుండపనేని ఉమావరప్రసాదు, రైతు సంఘం నాయుకులు పి.వి.ఆంజనేయులు, యలమందారావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ర్యాలీ అగ్రభాగాన వడ్డే శోభనాద్రీశ్వరరావు, కేశవరావు, రావుల వెంకయ్య, హరిబాబు తదితరులు

ముక్కు ద్వారా తీసుకునే తొలి వ్యాక్సిన్ 'ఇన్‌కొవాక్' విడుదల

న్యూఢిల్లీ : ముక్కు ద్వారా తీసుకునే కోవిడ్ వ్యాక్సిన్ 'ఇన్‌కొవాక్'ను కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, శాస్త్ర, సాంకేతికత శాఖ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం విడుదల చేశారు. భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన ఇన్‌కొవాక్ ప్రపంచంలోనే ముక్కు ద్వారా తీసుకునే తొలి కోవిడ్ వ్యాక్సిన్. రెండు విడతలుగానూ, తరువాత బూస్టర్ డోసుగానూ 18 ఏళ్లు దాటిన వారికి ఇవ్వడానికి ఈ వ్యాక్సిన్‌కు 2022 డిసెంబరులో ప్రభుత్వ అనుమతి లభించింది. అత్యవసర పరిస్థితుల్లో ఈ వ్యాక్సిన్‌ను వినియోగించకూడదని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ) పేర్కొంది. రెండు డోసులుగా ఇచ్చే ఈ వ్యాక్సిన్ మధ్య విరామం 28 రోజులు ఉండాలి. ఈ వ్యాక్సిన్ అపాయింట్‌మెంట్ కోసం కోవిన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒక డోసుకు రూ.800 ధర నిర్ణయించామని భారత్ బయోటెక్ తెలిపింది. ఇప్పటికే రెండు డోసులు, బూస్టర్ డోసు తీసుకున్న వారికి ఈ వ్యాక్సిన్ ఇవ్వబడదు.

కూలీల వాహనం బోల్తా

● ఓ మహిళ మృతి
● 22 మందికి గాయాలు

● లోపలి పేజీలో.. ●

ఇడి అధికారాలు పరిమితమే

● ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారాలపై ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఇడికి పరిమితమైన అధికారాలు మాత్రమే ఉన్నాయని, ఇడి అధికారాలు అపరిమితమేమీ కాదని కోర్టు గుర్తుచేసింది. మనీలాండరింగ్ కేసులను మాత్రమే ఇడి విచారించాలని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రతీదాంట్లో ఇడి జోక్యం తగదని పేర్కొంది. సెక్షన్ 3 నేరాలను మాత్రమే పరిశోధించడానికి పిఎంఎల్ ఇడి అధికారం ఇచ్చిందని, ప్రతి దాంట్లో ఇడి జోక్యం తగదని ఢిల్లీ హైకోర్టు హితవు పలికింది. విచారణ సందర్భంగా వేరే నేరాలు వెలుగులోకి వస్తే వాటిని సంబంధిత దర్యాప్తు సంస్థలు మాత్రమే విచారించాలని ఢిల్లీ హైకోర్టు సూచించింది. ఛత్తీస్‌గడ్‌లోని కోల్‌బ్లాక్‌ల కేటాయింపునకు సంబంధించిన కేసులో ఢిల్లీ హైకోర్టు తీర్పును వెల్లడించడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది.

బడ్జెట్ హల్వా...

కసరత్తు ప్రారంభించిన నిర్మలమ్మ

న్యూఢిల్లీ : ఆర్థిక సంవత్సరం 2023-24కు సంబంధించిన బడ్జెట్ రూపకల్పన కసరత్తును గురువారం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లాంచనంగా ప్రారంభించారు. ప్రతీ ఏడాది తరహాలోనే హల్వా తయారు చేసి సిబ్బందికి పంచడం ద్వారా ఈ ప్రక్రియను మంత్రి ప్రారంభించారు. ఢిల్లీలోని ఆర్థిక మంత్రిత్వ శాఖ నార్త్ బ్లాక్‌లో జరిగే ఈ బడ్జెట్ కసరత్తు సమయంలో ఎంపిక చేసిన ఉన్నతాధికారులు మినహా ఎవరినీ లోనికి, బయటికి పంపించరు. కనీసం కుటుంబ సభ్యులతోనూ ఎలాంటి సంప్రదింపులకు వీలుండదు. ఇందులో పాల్గొన్న అధికారులను పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాతే ఇంటికి అనుమతిస్తారు. హల్వా కార్యక్రమంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రులు పంకజ్ చౌదరీ, భగ్వత్ కిసన్‌రావు కరడ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇంతక్రితం రెండు బడ్జెట్‌ల తరహాలోనే 2023-24 బడ్జెట్‌ను కూడా కాగితపురహితంగా విడుదల చేయనున్నారు. బడ్జెట్ రూపకల్పన, ప్రక్రియలో ఫైనాన్స్ సెక్రటరీ టివి సోమనాథన్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్, దీపమ్ సెక్రటరీ తూహిన్ కాంత పాండే, రెవెన్యూ సెక్రటరీ సంజయ్ మల్హోత్ర, సిఇఎ అనంత వి నాగేశ్వరన్, ఇతర ఉన్నతాధికారులు కీలకంగా వ్యవహరించనున్నారు. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక వ్యవహారాల విభాగం తయారు చేసే బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో మంత్రి సీతారామన్ ప్రవేశపెట్టనున్నారు. గడిచిన నాలుగేళ్లుగా సీతారామన్ వరుసగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. ఇందిరా గాంధీ తర్వాత ఎక్కువ సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన మహిళగా సీతారామన్ రికార్డ్‌ను సృష్టించారు.

రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న బిజెపి

● బివి రాఘవులు విమర్శ
● గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖలో 'పీఠిక' పఠనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అమరావతి బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖ ఎల్ఐసి భవనం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం రాజ్యాంగ పీఠిక పఠన కార్యక్రమాన్ని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కార్యక్రమానికి హాజరైన వారందరు పీఠికను బిగ్గరగా చదువుతూ రాజ్యాంగ విలువలను కాపాడుతామని ప్రతిన చేశారు. బి. వి రాఘవులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ రక్షణ, దేశ స్వావలంబన కోసం ఉద్యమించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అధికారంలో ఉన్న రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ రాజ్యాంగ మౌలిక సూత్రాలపె బిజెపి దాడి చేస్తోందన్నారు. సనాతన విధానం పేరుతో మను ధర్మశాస్త్రాన్ని, పద్ధతులను ప్రజలపై రుద్దాలని చూస్తోందని విమర్శించారు. అన్ని భాషలనూ గౌరవించాలని రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్రపతి వ్యాఖ్యనించారని, అందుకు భిన్నంగా సంస్కృతం, హిందీ భాషలను మాత్రమే కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ప్రజలు, కార్మికులు నిరంతర ఉద్యమాన్ని కొనసాగించడాన్ని అభినందించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. దేశ సంపదను సృష్టిస్తున్న అణగారిన వర్గ ప్రజలకు నేడు రక్షణ కరువైందన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న సౌకర్యాలకంటే ప్రైవేట్ రంగంలోనే అనేక సౌకర్యాలున్నాయనే అబద్ధపు ప్రచారాన్ని పాలకులు చేస్తున్నారని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నెంబర్ 1 అత్యంత దారుణమైనదని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠికను చదువుతూ ప్రతిజ్ఞ చేయిస్తున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

విజయవాడలో జిఒ నెం1పై పోరాటానికి ప్రతిన

రోడ్లపై సభలు, సమావేశాలను నిషేదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నెం.1ని ఉపసంహరించుకునేంతవరకు

మిగతా 2లో

రిపబ్లిక్ డే వేడుకలను వీక్షిస్తున్న సిఎం

మొదటి స్థానం పొందిన గృహనిర్మాణ శాఖ శకటం

రెండవ స్థానం పొందిన డిజిటల్ విద్యాబోధన శకటం

మూడవ స్థానం పొందిన గ్రామ, సచివాలయాల శకటం

గృహ నిర్మాణ శకటానికి మొదటి బహుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గణతంత్ర దినోత్సవం శకటాల ప్రదర్శనలో గృహ నిర్మాణ శాఖ రూపొందించిన 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' శకటానికి మొదటి స్థానం సాధించింది. విద్యాశాఖ రూపొందించిన 'డిజిటల్ విద్యాబోధన' శకటం రెండో స్థానంలో, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ మూడో స్థానంలో నిలిచాయి. భద్రతా దళాల ప్రదర్శనలో ఇండియన్ ఆర్మీ మొదటి స్థానం, ఎపిపిఎస్‌పి 2వ బెటాలియన్ రెండో స్థానం సాధించాయి. భద్రతేర దళాల ప్రదర్శనలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ మొదటి స్థానం, ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్(బాయ్స్) రెండో స్థానం సాధించాయి. వీరికి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ బహుమతులను అందించారు.

రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసులకు పురస్కారాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విపత్తులు వచ్చినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలకు తెగించి రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న ఇద్దరు పోలీసులకు రూ.20 వేల నగదుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గురువారం రిపబ్లిక్ డే సందర్భంగా మంగళగిరిలోని ఎపిఎస్‌పి 6వ బెటాలియన్‌లో అడిషనల్ డిజి శంకబ్రత బాగ్చీ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. విపత్తులలో సమర్థవంతంగా పనిచేసేందుకు సుశిక్షితులైన పోలీసులతో ఎస్‌డిఆర్‌ఎఫ్‌ను 2017లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో పనిచేస్తున్న అసిస్టెంట్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి అప్పలస్వామి, హెడ్ కానిస్టేబుల్ డి వరప్రసాద్ ప్రకాశం బ్యారేజి వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన వారిని కాపాడారని అన్నారు. బి నవీన్‌కుమార్, బి మంగారావు, సుబ్బయ్య, కట్టా గోపిలతో పాటు గుర్తు తెలియని వ్యక్తికి వీరు ప్రాణదానం చేశారని కొనియాడారు. విట్ యూనివర్సిటీ వీరికి రూ.20 వేల చొప్పున నగదు పురస్కారం ప్రకటించిందని తెలిపారు. ప్రజలు ఆపదలో వున్నప్పుడు పోలీసులు ప్రాణత్యాగం చేసైనా కాపాడతారనేందుకు ఈ సంఘటనలే సాక్ష్యమంటూ శంకబ్రత బాగ్చీ అభినందించారు.

సిఎం నివాసంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం జరిగాయి. ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి ఆమె నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యదర్శి కె ధనుంజయ రెడ్డి, అదనపు కార్యదర్శి నారాయణ భరత్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న బిజెపి

మొదటి పేజీ తరువాయి

పోరాటం కొనసాగిస్తామని విజయవాడలో వామపక్షాలు ప్రతిజ్ఞ చేశాయి. రిపబ్లిక్ డే సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం ముందు ఈ కార్యక్రమం నిర్వహించారు.

బార్ కౌన్సిల్ సభ్యులు, జిఓ1 వ్యతిరేకపోరాట కమిటీ కన్వీనర్ సుంకర రాజేంద్రప్రసాదు ప్రతిజ్ఞ చేయించారు. "ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేకంగా జిఓ నెంబరు ఒకటిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. రాష్ట్ర ప్రజల ప్రాథమిక హక్కులకు భంగకరంగా, భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హరించే విధంగా ఇది ఉంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి, జిఓ నెంబరు 1 రద్దుచేసే వరకూ పోరాడుతాము. వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక, పరిషత్ సంఘాలు, ప్రజాస్వామిక వాదులను సమీకరించి ప్రజాస్వామ్య రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పాటుపడతాం. జిఓ నెంబరు1 ఉపసంహరించే వరకూ పోరాడతాం" అని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిఓ నెంబరు1తో ప్రజాస్వామ్యం గొంతు నులిమారని, దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటం నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభం మాత్రమేనని, జిఓను ఉపసంహరించుకునేంతవరకు వాడవాడలా ప్రజలను చైతన్యం చేయాలని చెప్పారు. ప్రజా రంగంలో ప్రజా ఉద్యమాల్లో పోరాడి సాధించుకునే హక్కును నిలబెట్టుకునేందుకు పోరాటం నిర్వహించాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ పౌర సంఘాలు, జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన 30వ తేదీన గాంధీ వర్థంతి రోజున పెద్దఎత్తున ఐక్యంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్, ప్రధాని మోడీ ఇద్దరూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, బి.రమణ, సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, న్యాయవాదులు రమేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

43 నెలల్లోనే గ్రామ స్వరాజ్యం

- రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరిస్తున్న ప్రభుత్వం
- లబ్ధిదారులకు 1.82 లక్షల కోట్ల సహాయం

గణతంత్ర వేడుకల్లో గవర్నర్ విశ్వభూషణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం గత 43 నెలల్లో 73 ఏళ్ల రాజ్యాంగ సారాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తోందని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన 74వ గణతంత్ర వేడుకల్లో గురువారం గవర్నర్ పాల్గొన్నారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి, పరేడ్‌ను పర్యవేక్షించి పోలీసులు, ఇతర భద్రతా దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రాష్ట్రప్రభుత్వ శకటాలను తిలకించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చామన్నారు. ఈ వ్యవస్థ సాకారం కావడానికి ముఖ్య పాత్ర గ్రామ, వార్డు సచివాలయాలదని చెప్పారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అందరికీ సమాన అవకాశం కల్పించాలనే రాజ్యాంగ స్ఫూర్తిని ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. అట్టడుగు వర్గాల భవితవ్యాన్ని మార్చడానికి ప్రత్యక్ష నగదు బదిలీని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. దీని ద్వారా రూ.1.82లక్షల కోట్లను పారదర్శకంగా లబ్ధిదారులకు అందించినట్లు చెప్పారు. 30 లక్షల ఇళ్లపట్టాలను మహిళలకు అందించినట్లు వివరించారు. మహిళా సాధికారతకు వైఎస్ఆర్ ఆసరా, చేయూత, జగనన్న అమ్మఒడి వంటి విప్లవాత్మక పథకాలను తీసుకొచ్చామన్నారు. అమ్మఒడికి రూ.19,617 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. మన బడి నాడు-నేడు కింద 45,484 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను అభివృద్ధి పరుస్తున్నామని చెప్పారు. జగనన్న గోరుముద్ద పథకానికి రూ.3239.43 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, బోధిస్తున్న ఉపాధ్యాయులకు రూ.778 కోట్లతో ట్యాబ్‌లను అందించామన్నారు. ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆరోగ్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. 10,032 వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లను, 528 అర్బన్ హెల్త్ క్లినిక్‌లు, 1142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 177 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, 53 ఏరియా ఆస్పత్రులు, 12 జిల్లా ఆస్పత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించిన్నట్లు చెప్పారు. ఉపాధిహామీ చట్టం అమలులో రాష్ట్రం 5వ స్థానంలో ఉందన్నారు. జలయజ్ఞం కింద చేపట్టిన ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర పోలీసుల సమర్థ పనితీరు కారణంగా 2022లో రాష్ట్రంలో నేరాలు గణనీయంగా తగ్గాయని, వినూత్న పోలీసింగ్ చర్యల ద్వారా ఇది సాధ్యమైందన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో వికేంద్రీకరణ దిశగా పెద్ద అడుగు వేసిందన్నారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం ద్వారా వందేళ్ల తరువాత సమగ్ర భూ సర్వేను దేశంలో చేపట్టిన తొలి రాష్ట్రమని చెప్పారు. శకటాల ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన శకటాలకు, భద్రతా దళాలకు గవర్నర్ మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత కుమార్ మిశ్రా, శాసన మండలి చైర్మన్ కె మోషేను రాజు, శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ప్రవీణ్ ప్రకాశ్ చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న స్కౌట్స్, గైడ్స్

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణ

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రాజ్యాంగ పరిరక్షణకు స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉండవల్లిలోని తన నివాసంలో జాతీయ జెండాను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విధ్వంసాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. రాజ్యాంగ విరుద్ధ, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనతో రాష్ట్ర భవిష్యత్ ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోలేకపోతే ప్రజాస్వామ్య మనుగడే ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. 2029 నాటికి ఎపిని దేశంలో నెంబర్ 1గా రాష్ట్రంగా మార్చేందుకు టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రణాళికాబద్ధంగా పనిచేశామని తెలిపారు. యువశక్తిని సక్రమంగా వినియోగించుకుంటే ప్రపంచంలో అత్యున్నత స్థాయికి భారత్ చేరుకుంటుందన్నారు.

ఐదేళ్లకోసారి మారే ఐడియాలజీ నాది

- జనసేన అధినేత పవన్ కల్యాణ్

తనది ఐదేళ్లకొకసారి మారే ఎన్నికల ఐడియాలజీ అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు ప్రత్యేక అజెండాలు ఏమీ ఉండవని, ప్రజలకు జరిగే మంచి మాత్రమే తన అజెండా అని పేర్కొన్నారు. ప్రజల అవసరాల కోసం మారే మధ్యస్థవాదినని అన్నారు. సంఖ్యా బలం లేని అణగారిన కులాలకు బలంగా నిలబడాలని భావించే ఆలోచన విధానమన్నారు. పూర్తిస్థాయి అవగాహనతో మాట్లాడే నైజమని, దీనిని రకరకాల వ్యక్తులు రకరకాలుగా మాట్లాడినా పెద్దగా పట్టించుకోనని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ కోసం జనసేన రాజకీయ వ్యూహాలు ఉంటాయని, ఎలాంటి వ్యూహాలైనా తనకు వదిలేయండని చెప్పారు. ఇప్పటికే ఇప్పుడు ముఖ్యమంత్రి కావాలని పార్టీ పెట్టలేదన్నారు. ఒక్కోటి మెల్లగా జరుగుతాయని, నిజాయితీగా పనిచేసుకుంటూ ముందుకెళ్లాలని కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్రం కావాలని అడుగుతుంటే, బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతున్నారని తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రులు చాలా మంది ఉన్నారని, అయినా ఈ ప్రాంతానికి చేసిందేమిటని ప్రశ్నించారు.

రాష్ట్రానికి కేంద్రం నమ్మక ద్రోహం

- విభజన హామీలు సాధించుకునే వరకు పోరాటం
- ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్
- కడపకు చేరుకున్న ప్రత్యేక హోదా సమరయాత్ర 2.0

ప్రజాశక్తి - కడప అర్బన్

విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నమ్మక ద్రోహం చేస్తోందని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అన్నారు. విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి చేపట్టిన 'ప్రత్యేక హోదా సాధన సమరయాత్ర 2.0' గురువారం కడపకు చేరుకుంది. మరియాపురం సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో నేతలు సమావేశమయ్యారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎపికి ప్రత్యేక హోదా ఐదు కాదు పది సంవత్సరాలు ఇస్తానని తిరుపతి బహిరంగ సభలో ప్రధాని మోడీ చెప్పారన్నారు. హామీ ఇచ్చి ఎనిమిదిన్నర సంవత్సరాలు దాటినా ఇంతవరకు హామీల ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కోసం సమరయాత్ర చేపట్టామని తెలిపారు. రాజకీయ నాయకులు వారి స్వలాభం కోసం, పదవుల కోసం రాష్ట్ర, యువత ప్రయోజనాలు తాకట్టుపెడతామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అవకాశం ఉందని మెకాన్ సంస్థ స్పష్టంగా చెప్పిందని పేర్కొన్నారు. ఉపాధిలేక నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కడప ఉక్కు ఆంధ్రుల హక్కుగా పోరాడతామని తెలిపారు. 11 కేంద్ర విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించే వరకు పోరాటాలు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాలు కల్పించడకుండా ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. సెయిల్ ఆధ్వర్యాన కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు సాధన ఐక్యవేదిక అధ్యక్షులు బి.నారాయణ మాట్లాడుతూ.. ఉక్కు పోరాటంలో విద్యార్థులు భాగస్వాములయ్యారని తెలిపారు. కేంద్రం మెడలు వంచైనా విభజన హామీలు సాధించుకుంటామని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, గంగాసురేష్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

గవర్నర్ తేనేటి విందుకు ప్రతిపక్షాలు గైర్హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ నిర్వహించిన తేనేటి విందుకు ప్రతిపక్ష పార్టీల నాయకులు గైర్హాజరయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎట్‌హోం పేరుతో రాజ్‌భవన్ వేదికగా తేనేటి విందు ఏర్పాటు చేయటం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులతోపాటు ప్రతిపక్ష పార్టీలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలకు రాజ్‌భవన్ ఆహ్వానాలు పంపుతోంది. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో అధికార పార్టీ నేతలు మినహా ఇతర పార్టీల నాయకులెవరూ హాజరు కాలేదు. సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా సతీసమేతంగా హాజరయ్యారు. శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారం, మంత్రి జోగి రమేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలించాలి

- 'దండి మార్చ్' విగ్రహావిష్కరణలో ఆదిమూలపు, సజ్జల

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

స్వాతంత్ర్యోద్యమ పోరాట స్ఫూర్తిని నూతన తరానికి అందించడానికి దండి మార్చ్ విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని వద్ద ఏర్పాటు చేసిన దండి మార్చ్ విగ్రహాన్ని గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ సర్వేక్షణ్, నగర బాటలో భాగంగా రాష్ట్రంలో పట్టణాలు, నగరాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. మూడు రాజధానుల ఏర్పాటు నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని నగరాలను సుందరంగా తీర్చిదిద్దనున్నామని అన్నారు. భావితరాలకు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని తెలిపేలా పెద్దకాకాని వద్ద దండి మార్చ్ ఉద్యమ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో దండి మార్చ్ కీలకమని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం కులమతాలకు అతీతంగా, అందరిని ఐక్యంగా కలుపుకొని మహాత్మాగాంధీ దండి మార్చ్ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు, ఎల్.అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్, కిలారి రోశయ్య, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, కమిషనర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

దండి మార్చ్ విగ్రహం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ దారుణం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 714వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎల్ఎంఎంఎం, ఎస్‌బిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, డి.సురేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై దేశమంతటా విమర్శలు వెల్లువెత్తుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడతామని బరితెగింపు ప్రకటనలు చేయడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలనూ కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై గళమెత్తేందుకు ఈ నెల 30న ఉక్కునగరంలో తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె.భాస్కర్, సీతారామరాజు, త్రినాథ్, జగ్గారావు, ఎ.రవి, వీరాస్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మధు

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- బాధిత కుటుంబాలకు మధు, మాల్యాద్రి పరామర్శ

ప్రజాశక్తి - దగదర్తి (నెల్లూరు)

నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో దళితులపై జరిగిన దాడుల గురించి తెలుసుకున్న సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంపి పి. మధు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రితో కలిసి గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం దగదర్తిలోని జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ..ఉప్పలపాడు గ్రామానికి చెందిన దళిత రైతు పొలాన్ని అదే గ్రామానికి చెందిన పెత్తందారు అక్రమంగా దున్నివేశారని, దీన్ని అడ్డుకున్న అతడిని కులం పేరుతో దూషించారని తెలిపారు. కేసు నమోదై రెండు నెలలు కావస్తున్న పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఉలవపాడు పెట్రోల్ బంకుల పనిచేస్తున్న దళిత యువకుడిపై బాడుగులుపాడు ఎంపిటిసి మహేష్ నాయుడు ఇష్టానుసారంగా దాడి చేశారని తెలిపారు.. దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ..ఇదే విధంగా దళితులు పై దాడులు జరుగుతుంటే రాష్ట్రవ్యాప్తంగా కెవిపిఎస్, సిపిఎం కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. వీటన్నిటిపై ఫిబ్రవరి ఎనిమిదిన మండలంలో మీటింగ్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ హాజరవ్వాలని కోరారు.

అనంతపురంలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న అఖిలపక్షం నేతలు

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం..

- జిఓ 1ను తక్షణమే రద్దు చేయాలి : సిపిఎం
- అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రతిజ్ఞ, నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రోడ్ షోలు, సభలు, సమావేశాలపై నిషేదం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఓ 1కు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేశారు. 'నిరసన.. ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు' అని, జిఓ 1ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మోడీ సర్కారు తీరుపై ధ్వజమెత్తుతూ 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం' అంటూ ప్రతినబూనారు. 'మతపూరితమైన' పాలనలో 'రాజ్యాంగాన్ని కాపాడుకోవడం' తక్షణ కర్తవ్యమని నేతలు అన్నారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన జిఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సిపిఎం, కాంగ్రెస్, టిడిపి నాయకులు పాల్గొన్నారు. విజయనగరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట, పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలో సిపిఎం నేతలు ప్రతిజ్ఞలు చేశారు. జిఓ 1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా గూడూరులో బిక్షాటన చేసి నిరసన తెలిపారు. సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, పుత్తూరు, కెవిబిపురంలో అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రతిజ్ఞ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట జిఓ 1 రద్దు ఐక్య పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు రాజ్యాంగ పీఠిక చదివి ప్రతిజ్ఞ చేశారు. అప్రజాస్వామికంగా, భావ ప్రకటన స్వేచ్ఛను హరించే విధంగా, ప్రతిపక్షాల గొంతును నొక్కే విధంగా జారీ చేసిన జిఓ ఒకటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్ర ఘన విజయం

- అస్సాంపై ఇన్నింగ్స్ 95పరుగుల తేడాతో గెలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని చింతలవలస పివిజి రాజు క్రికెట్ మైదానంలో జరుగుతున్న రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బిలో ఆంధ్రప్రదేశ్ జట్టు ఘన విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో అస్సాంను 113పరుగులకే పరిమితం చేసిన ఆంధ్రప్రదేశ్ అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో 361 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఓవర్‌నైట్ స్కోర్ ఐదు వికెట్ల నష్టానికి 62 పరుగులతో గురువారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అస్సాం జట్టును లలిత్(5/40), షోయబ్(2/30) దెబ్బతీసారు. దీంతో అస్సాం జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 153పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆంధ్ర జట్టు ఇన్నింగ్స్ 95పరుగుల తేడాతో విజయం సాధించింది.

ఓటమిదిశగా హైదరాబాద్..

ఢిల్లీతో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఓటమి కోరల్లో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 355పరుగులు చేస్తే.. ఢిల్లీ జట్టు 433పరుగులు చేసింది. దీంతో 78పరుగులు వెనుకబడ్డ హైదరాబాద్ జట్టు గురువారం రెండో ఇన్నింగ్స్‌లో 90పరుగులకే 5వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. సంతోష్(20), షషాంక్(12) క్రీజ్‌లో ఉన్నారు.

డెయిరీ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న ఆనంద్ కుమార్

విశాఖ డెయిరీ చైర్మన్‌గా ఆడారి ఆనంద్ కుమార్

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

విశాఖ డెయిరీ చైర్మన్‌గా ఆడారి ఆనంద్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 36 సంవత్సరాలుగా ఆయన తండ్రి ఆడారి తులసీరావు ఈ డెయిరీ చైర్మన్‌గా వ్యవహరించి ఈ నెల నాలుగున కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆనంద కుమార్ నూతన చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయనకు డెయిరీ ఎండి ఎస్‌వి.రమణ సహా పలువురు ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జిఒ 145 రద్దు పట్ల నరెడ్కో, క్రెడాయ్ హర్షం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రయివేటు లే అవుట్లలో ఐదు శాతం భూమిని ప్రభుత్వానికి విడిచి పెట్టాలంటూ ఇచ్చిన జిఒ 145ను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల నరెడ్కో, క్రెడాయి సంస్థలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు గురువారం నరెడ్కో రాష్ట్ర చైర్మన్ జి.హరిబాబు, అధ్యక్షులు ఎస్.శ్రీనగేష్, విశాఖ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ బాబు, దండమూడి పాపారావు, ఉపాధ్యక్షులు వెంకన్న చౌదరి, క్రెడాయ్ చైర్మన్ బాయన శ్రీనివాసరావు, కార్యదర్శి ఇ.అశోక్ కుమార్ వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఈ జిఒ రద్దు వల్ల నిర్మాణ రంగానికి, ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారికి, సామాన్యులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇప్పటికే అనేక సమస్యలతో అతలాకుతలం అవుతున్న రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వ చర్య ఎంతో ఊతమిచ్చినట్టయిందని తెలిపారు. జిఒ రద్దుకు రియల్ ఎస్టేట్ సంస్థలు చేసిన పోరాటాలను, విజ్ఞప్తులను గుర్తు చేశారు. సిఎం జగన్మోహన్ రెడ్డికి, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రిన్సిపల్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మికి ధన్యవాదాలు తెలిపారు.

ఖజానాకు 'స్థానిక' నిధులు

- ఆక్షేపించిన ఎజి కార్యాలయం
- భారీగా విద్యుత్ బకాయిలున్నందునే మినహాయించాం
- రూ.1351 కోట్లపై తేల్చిచెప్పిన రాష్ట్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గ్రామాల అభివృద్ధి కోసం ఆర్థికసంఘం ఇస్తున్న నిధులను రాష్ట్ర ఆర్థికశాఖ నేరుగా తీసుకుంటోంది. ఆయా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి నిధులు రాగానే వాటిని ఖజానాకు మళ్లిస్తున్నారు. దీనిపై అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం కూడా ఆక్షేపించింది. ఇది సరికాదని, నిధుల మళ్లింపు కిందకే వస్తుందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని సమర్థించుకుంటూ, స్థానిక సంస్థల నుంచి భారీ ఎత్తున విద్యుత్ బకాయిలు రావాల్సి ఉందని, అందుకే అందుకు సరిపడా నిధులను తాము తీసుకుంటున్నామని పేర్కొంది. ఇటీవల స్థానిక సంస్థలకు ఇచ్చిన నిధుల్లో రూ.1,351.47 కోట్లను రాష్ట్ర ఆర్థికశాఖ నేరుగా స్వాధీనం చేసుకుంది. స్థానిక సంస్థలు మాత్రమే ఈ నిధులను విత్‌డ్రా చేసుకుని ఖర్చు చేసుకునేందుకు అధికారం ఉంటుంది.

ఆయా సంస్థల అనుమతి లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం నిధులను వాడుకోవడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని ఇటీవల కాగ్ ఆరోపించింది. రాష్ట్ర ఆర్థికశాఖ మాత్రం ఇది తప్పుకాదంటూ కాగ్‌కు సమాధానమిచ్చింది. చాలాకాలంగా స్థానిక సంస్థల నుంచి విద్యుత్ బకాయిలు రావడం లేదని, అందుకే వాటికి వచ్చిన నిధుల నుంచి మినహాయించుకుంటున్నామని తేల్చిచెప్పింది. ఇదే అంశాన్ని గతంలో ఎజి కార్యాలయానికి కూడా తెలియపరిచినట్లు పేర్కొంది. చాలా సంవత్సరాలుగా విద్యుత్ బకాయిలు ఉన్నాయని, దాదాపు ఇవి ఐదు వేల కోట్ల వరకు ఉంటాయని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. బకాయిలు రాకపోవడం వల్ల డిస్కామ్‌లు కూడా తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాయని అంటున్నారు. బిల్లులు చెల్లించని స్థానిక సంస్థలకు విద్యుత్ కనెక్షన్లను తొలగిస్తే ప్రజలకు కూడా సమస్యగా ఉంటుందని, అందుకే ఆయా సంస్థలకు వచ్చిన నిధులను విద్యుత్ బకాయిల కింద తీసుకుంటున్నామని ఆర్థికశాఖ చెబుతోంది. వాస్తవానికి ఆర్థిక సంఘం నిధులను ఇలా ఇతర అంశాలకు వాడుకోవడం సరికాదు.

అభివృద్ధి పనులకు మాత్రమే వినియోగించుకోవాల్సి ఉంటుందని అధికారులు కూడా చెబుతున్నారు. స్థానిక పన్నులు, సెస్‌లు, ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్ని నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఇతర ఖర్చులకు వినియోగించాల్సి ఉంటుంది. స్థానికంగా పన్నుల వసూళ్ల సక్రమంగా లేని కారణంగా ఆదాయం కూడా తగ్గిపోయినట్లు స్థానిక సంస్థలు పేర్కొంటున్నాయి. ఇదే సమయంలో పలు వ్యయాలకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడం వల్ల కూడా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా సంస్థలు చెబుతున్నాయి.

మూడు రాజధానులు మా విధానం : మంత్రి బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి అయ్యేలా మూడు రాజధానులు అనేది తమ పార్టీ విధానమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. పవన్‌కల్యాణ్ పార్టీకి విధానమే లేదని, అమరావతి ఒక్కటి అభివృద్ధి అయితే చాలనుకుంటారని విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉగాది నాటికి పరిపాలనను విశాఖపట్నంనుండి నిర్వహించేందుకు సిఎంపై ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు. ధర్మాన ప్రసాదరావు ప్రాంతీయ ఉద్దేశ్యంతో ఒక మాటంటే దాన్ని పట్టుకొని పవన్‌కల్యాణ్ మాట్లాడటం సరైంది కాదన్నారు. పవన్ కల్యాణ్ లక్ష్యం లేకుండా రాజకీయాలు చేస్తున్నారని జనసేనకు ఒక విధానం కూడా లేదన్నారు. రాజకీయాలు అంటే రెచ్చగొట్టడం కాదనే విషయం పవన్‌కల్యాణ్ తెలుసుకుంటే మంచిదన్నారు. తాటతీస్తాం, తోలు వలుస్తాం, చెప్పుతో కొడతాం అనే రెచ్చగొట్టే భాషను మానుకోవాలని అన్నారు. రాజకీయాల్లో పవన్ కల్యాణ్‌కు కెఎ పాల్‌కు తేడా లేదని అన్నారు. ఎస్‌సిలకు 32 పథకాల ద్వారా రూ 60వేల కోట్లు ఖర్చుచేశామని తెలిపారు.

రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగానే పాలన : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యాంగం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో జాతీయ పతాకాన్ని సజ్జల ఆవిష్కరించి, మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అణగారిన వర్గాల అభ్యున్నతికి, సమానత్వానికి దిక్సూచిలా పని చేస్తోందని అన్నారు. రాజ్యాంగ రచన సమయంలో ఏ కలలైతే కన్నారో వాటిని సాకారం చేయడంకోసం ముఖ్యమంత్రి నిరంతరం కృషిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి కేంద్రకార్యాలయ పర్యవేక్షకులు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గ్రంధాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ మందపాటి శేషగిరిరావు, నవరత్నాల అమలు ప్రోగ్రామ్ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, లిడ్‌క్యాప్ ఛైర్మన్ కాకుమాను రాజశేఖర్ పాల్గొన్నారు.

సిఎం అభ్యర్థి ఎవరో చెప్పాలి

రాష్ట్రంలో వైసిపికి ముఖ్యమంత్రి ఎవరనే అంశంపై స్పష్టత వుందని, చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లలో ఎవరు సిఎం అభ్యర్థో ప్రజలకు తెలుగుదేశం, జనసేన స్పష్టతను ఇవ్వాలని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. సొంత రాజకీయ అజెండాలేకుండా కేవలం చంద్రబాబునాయుడి రాజకీయాల కోసమే పనిచేస్తున్న పవన్ కల్యాణ్ తెలుగుదేశంకు గెస్ట్ ఆర్టిస్ట్‌లా మారాడని విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో దళితులకు సబ్‌ప్లాన్ కంటే ఎక్కువగా నిధులు అందిస్తున్నామన్నారు. చంద్రబాబు ఐదేళ్లలో రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ మూడున్నర ఏళ్లలో రూ.48 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. లోకేష్ పాదయాత్రను తెలుగుదేశం అతిగా ఊహించుకుంటోందన్నారు. జగన్ పాదయాత్ర చేసినప్పుడు ఉన్న నిబంధనలే ఇప్పుడు ఉన్నాయని తెలిపారు.

కుల, మతాల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కులాలు, ప్రాంతాలు, మతాల మధ్య బిజెపి చిచ్చు పెడుతోందని, ఇది దేశ ఐక్యతకు, సార్వభౌమత్వానికి తీరని నష్టమని మాజీ ఎంపి కెవిపి.రామచంద్రరావు అన్నారు. భారత్ జోడో యాత్రకు మద్దతుగా కాంగ్రెస్ ఆధ్వర్యాన గురువారం విశాఖలో భారీ ర్యాలీ నిర్వహించారు. అల్లిపురంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత కాంగ్రెస్ నగర కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఉత్తమ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ వ్యతిరేక పోరాటంలో కాంగ్రెస్ పాల్గొంటుందన్నారు.

అంకితభావంతో పనిచేయండి

- ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రయాణికుల మన్ననలను పొందుతూనే వాణిజ్యపరంగా ఆదాయాలను పెంచుకునేలా ఆర్‌టిసి ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని ఆర్‌టిసి హౌస్‌లో రిపబ్లిక్‌డే సందర్భంగా ఘనతంత్ర వేడుకలను ఆర్‌టిసి ఉద్యోగులు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్‌టిసి 2022లో సత్ఫలితాలను సాధించినట్లుగానే 2023లోనూ సాధించాలని కోరారు. సాంకేతిక అంశాల్లో ఎన్నో జాతీయ అవార్డులను సాధించేందుకు ఉద్యోగుల అంకితభావమే కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్లు కోటేశ్వరరావు, కెఎస్ బ్రహ్మానందరెడ్డి, పి కృష్ణమోహన్, గిడుగు వెంకటేశ్వరరావు, ఆర్థిక సలహాదారు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కృష్ణా ఆర్‌ఎం ఎంవై దానం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయం ఎదుట నారా లోకేష్

నేడు 11.03 గంటలకు లోకేష్ 'యువగళం' తొలి అడుగు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/తిరుమల

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శుక్రవారం ఉదయం 11.03 గంటలకు ప్రారంభం కానుంది. గురువారమే కుప్పం చేరుకున్న లోకేష్ రాత్రి ప్రభుత్వ అతిథి గృహంలో బస చేశారు. శుక్రవారం అక్కడి నుంచి 10.15 గంటల స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం నాలుగు వేల కిలోమీటర్ల యువగళం పాదయాత్రకు 11.03 గంటలకు తొలి అడుగు వేయనున్నారు. అనంతరం కుప్పంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సభలో ప్రసంగిస్తారు. తొలి రోజు 8.5 కిలోమీటర్ల దూరం యాత్ర సాగనుంది. ఈ నెల 29వ తేది వరకు మూడు రోజుల పాటు కుప్పంలోనే యాత్ర జరుగుతుంది. 30 నుంచి ఫిబ్రవరి 2వ తేది వరకు పలమనేరు టు పూతలపట్టులో, ఫిబ్రవరి 3 నుంచి 5వ తేది వరకు పూతలపట్టు నుంచి చిత్తూరు వరకు, 6వ తేది నుంచి 8వ తేది వరకు చిత్తూరు నుంచి జిడి నెల్లూరులో యాత్ర సాగనుంది.

శ్రీవారి సేవలో లోకేష్

'యువగళం' పాదయాత్ర విజయవంతం కావాలని తిరుమల శ్రీవారిని నారా లోకేష్ గురువారం దర్శించుకున్నారు. తిరుమలలో మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు కుమారుడి వివాహానికి హాజరై నూతన వధువరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఇంటికి చేరుకున్నారు. అనంతరం అక్కడినుంచి కుప్పం నియోజకవర్గానికి చేరుకున్నారు.

ప్రారంభించకనే సర్వమంగళమా : బీటెక్ రవి

పాదయాత్ర మొదలు పెట్టి జనాలు రాకపోతే సర్వమంగళం అనాలని, పాదయాత్ర మొదలు కాకుండానే సర్వమంగళం అని ఎలా అంటారని మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలపై బిటెక్ రవి స్పందించారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌కు అప్పుడే లోకేష్ పాదయాత్రపై భయం పట్టుకుందన్నారు.

మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

ప్రజాశక్తి - సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఆంధ్ర - ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టుల భారీ డంప్‌ను ఒడిశా పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం మేరకు.. ఎఒబి జోన్‌లోని మల్కనిగిరి జిల్లా తులసి, జార్బిబట్ట అటవీ ప్రాంతాల్లో పోలీసు బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో భారీ ఆయుధ సామగ్రితో కూడిన డంప్ లభ్యమైంది. ఎయిర్ పిస్టల్స్, బ్యారెల్స్, గ్రైనేడ్స్, రాకెట్ లాంచర్లు, ఎస్‌ఎల్‌ఆర్ తుపాకులు, ఒక నాటు తుపాకీ, క్యారేజ్ బాంబులు, విప్లవ సాహిత్యం దానిలో ఉన్నట్టు పోలీసు అధికారులు తెలిపారు.

కూలీల వాహనం బోల్తా

- ఓ మహిళ మృతి
- 22 మందికి గాయాలు

ప్రజాశక్తి-పంగులూరు (బాపట్ల జిల్లా)

మిరపకాయల కోతకు వెళ్లి తిరిగి వస్తుండగా.. టైరు పేలి టాటాఎస్ వాహనం బోల్తా పడటంతో ఓ మహిళ కూలీ మృతిచెందగా.. 21 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన బాపట్ల జిల్లా పంగులూరు మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..మండలంలోని జాగర్లమూడివారిపాలెం దళిత, గిరిజన కాలనీలకు చెందిన సుమారు 25 మంది కూలీలు గత మూడు రోజులుగా ముండ్లమూరు మండలం తమ్మలూరు గ్రామానికి మిరపకాయల కోతకు వెళ్తున్నారు. పని ముగించుకుని ఇంటికి వస్తుండగా.. జాగర్లమూడివారిపాలెం సర్వీసు రోడ్డుకు చేరుకోగానే వాహనం వెనుక టైరు పేలిపోయింది. వాహనం బోల్తా పడటంతో కూలీలందరూ చెల్లాచెదురుగా పడిపోయారు. 22 మందికి గాయాలయ్యాయి. ఇందులో గిరిజన కాలనీకి చెందిన నంబూరు రంగమ్మ (65), పొన్నూరు రామతీర్థం, మరో మహిళకు తీవ్ర గాయాలు కావటంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మార్గమధ్యలో నంబూరి రంగమ్మ మృతిచెందారు. రామతీర్థం పరిస్థితి విషమంగా ఉంది. అద్దంకి ప్రభుత్వాసుపత్రికి 18 మందిని తరలించగా, అందులో కల్లూరి నాగమణి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

విలేకరులతో మాట్లాడుతున్న బాలకృష్ణ

ఎఎన్‌ఆర్ బాబాయ్ లాంటివారు

- ఆయన్ను కించపరచలేదు : బాలకృష్ణ

ప్రజాశక్తి - హిందూపురం

అక్కినేని నాగేశ్వరరావు అంటే తనకెంతో అభిమానం అని, ఆయన బాబాయ్ లాంటి వారని నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలోని వివిధ కార్యక్రమాల్లో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అక్కినేనిపై ఇటీవల చేసిన వివాదాస్పద వాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నలకు బాలకృష్ణ స్పందించారు. అక్కినేనిని తాను చాలా అభిమానిస్తానని, ఆయన నుంచి చాలా నేర్చుకున్నానని తెలిపారు. పొగడ్తలకు పొంగి పోరాదనే గుణం ఆయన నుంచే నేర్చుకున్నానని చెప్పారు. వాడుక భాషలో మాట్లాడే క్రమంలో భాగంగా ఆ పదం దొర్లిందని, ఇందులో అక్కినేని కించపరచాలనే భావన ఏమాత్రం లేదని చెప్పారు. ఎన్‌టిఆర్ మరణం అనంతరం ఆయన పేరుతో ఏర్పాటు చేసిన జాతీయ అవార్డును మొట్టమొదటిసారిగా అక్కినేని నాగేశ్వరరావుకే అందించినట్లు చెప్పారు. అక్కినేని తనను ఎంతో ఆప్యాయంగా పలకరిస్తారని, తానూ అంతే ఆప్యాయత, అనురాగాలు ఆయనపై చూపించేవాడినని చెప్పారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం అని నందమూరి బాలకృష్ణ విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండలం, లేపాక్షి నుంచి గలిబిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. ప్రస్తుతం వాటి జాడే లేదని ఆరోపించారు. అనంతరం హిందూపురం చిన్నమార్కెట్‌లో నిర్వహించిన 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులు అదృశ్యం

ప్రజాశక్తి - రుద్రవరం

నంద్యాల జిల్లా రుద్రవరం మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో ఎనిమిది, తొమ్మిదవ తరగతి చదువుతున్న అక్కాచెల్లెలు ఇద్దరూ గురువారం మధ్యాహ్నం నుంచి అదృశ్యమయ్యారు. ప్రిన్సిపల్ తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరంలోని దాసరపల్లె కాలనీకి చెందిన తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, సరస్వతి కుమార్తెలు చందన(14) తొమ్మిదవ తరగతి, చాందిని (13) ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. ఆరవ తరగతి నుంచి ఇద్దరూ కస్తురిబా గురుకుల పాఠశాలలో చదువుకుంటున్నారు. గురువారం మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇద్దరూ అదృశ్యమయ్యారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు రుద్రవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నిరంజన్ రెడ్డి కేసు నమోదు చేసి విద్యార్థుల కోసం సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు.

వైసిపి నేత వాహనంలో కర్ణాటక మద్యం

- స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - కడపప్రతినిధి/ఖాజీపేట

బెంగళూరు నుంచి కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన వైసిపి నాయకులు శివరామకృష్ణను ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో అధికారులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. కడప జిల్లా ఖాజీపేట మండలం పాటిమీదపల్లె కడప-కర్నూలు టోల్ ప్లాజా వద్ద వైసిపి నాయకుడి కారును తనిఖీ చేశారు. సుమారు రూ.20 లక్షలు విలువ చేసే 46 కేసుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం మద్యంతో సహ శివరామకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం.

ప్రపంచ వృద్ధి 1.9 శాతమే..!

- ఐక్యరాజ్య సమితి అంచనా

వాషింగ్టన్ : ప్రస్తుత ఏడాది 2023లో ప్రపంచ వృద్ధి రేటు 1.9 శాతానికే పరిమితం కావొచ్చని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. ఉక్రెయిన్-రష్యా ఆందోళనలకు తోడు అహారం, ఇంధన సంక్షోభం వృద్ధి రేటును దెబ్బతీయనుందని విశ్లేషించింది. ఆర్థిక అనిశ్చితి చోటు చేసుకోనుందని 'యుఎన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ ఎఫైర్స్' రిపోర్ట్‌లో పేర్కొంది. 2023లో అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లోనూ మందగమనం చోటు చేసుకోనుందని తెలిపింది. దీనిపై 178పేజీల రిపోర్టును రూపొందించింది. "అధిక ద్రవ్యోల్బణం, కఠిన ద్రవ్య పరపతి విధానం, పెరిగిన అనిశ్చిత్తుల మధ్య ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించనుంది." అని యుఎన్ సెక్రటరీ జనరల్ అంటోనియో గుటెర్రెస్ పేర్కొన్నారు. "ప్రస్తుత ఏడాదిలో గ్లోబల్ వృద్ధి 1.9 శాతంగా ఉండొచ్చు. 2022లో 3 శాతంగా అంచనా వేసింది. ఇటీవలి దశాబ్ద కాలంలో ఇదే అత్యల్ప వృద్ధి రేటు కానుంది. ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుముఖం పట్టి, ఆర్థికంగా ఎదురుగాలి తగ్గడం ప్రారంభిస్తే 2024లో ఇది 2.7 శాతానికి పెరగనుందని అంచనా." అని ఈ రిపోర్టు పేర్కొంది. ఇటీవల ప్రపంచ బ్యాంక్ కూడా గ్లోబల్ వృద్ధి రేటు అంచనాలను 3 శాతం నుంచి 1.7 శాతానికి తగ్గించింది. 2022లో 3.2 శాతం వృద్ధి, 2023లో 2.7 శాతం పెరుగుదల ఉండొచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. 2023 కష్టతరమైన సంవత్సరంగా సాగనుందని గత వారం దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక ఫోరంలో ఐఎంఎఫ్ ఎండి క్రిస్టాలినా జార్జివా పేర్కొన్నారు. ఇదే సమావేశాల్లో ప్రపంచంలో పెరుగుతున్న ఆదాయ అసమానతలను యుఎన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ ఎఫైర్స్ డివిజన్ డైరెక్టర్ శాంతను ముఖర్జీ ఎత్తిచూపారు. "ఈ సంవత్సరం యునైటెడ్ స్టేట్స్, యూరోపియన్ యూనియన్, ఇతర అభివద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో వద్ధి బలహీనంగా ఉంది.

ఇది మిగిలిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసింది. 2023లో అమెరికా వృద్ధి ఏకంగా 0.4 శాతానికి పడిపోనుంది. 2022లో ఇది 1.8 శాతంగా ఉండొచ్చు. అనేక యూరోపియన్ దేశాల వృద్ధి కూడా మందగించనుంది. ఉక్రెయిన్ యుద్ధ పరిణామాలు ద్రవ్యోల్బణ పెరుగుదల, కఠిన ద్రవ్య పరపతి విధానాలు, పడిపోయిన కుటుంబాల ఆదాయం, పెట్టుబడులు వృద్ధి రేటును ఒత్తిడికి గురి చేస్తున్నాయి" అని యుఎన్ రిపోర్ట్ పేర్కొంది.

మరో రెండు టెక్ కంపెనీల్లో ఉద్వాసనలు

- ఐబిఎంలో 3,900 మంది,ఎస్‌ఎపిలో 3000 మందికి కోత

న్యూయార్క్/ బెర్లిన్ : టెక్నలాజీ కంపెనీలు ఉద్యోగుల తొలగింపులో దూకుడుగా వ్యవహారిస్తున్నాయి. తాజాగా ఐబిఎం, ఎస్‌ఎపి కంపెనీలు వేలాది మంది ఉద్యోగులకు ఉద్వాసనలు పలికాయి. ఐబిఎం 3,900 మందికి కోత పెట్టనుండగా.. ఎస్‌ఎపిలో 3,000 మందిని ఇంటికి పంపించాలని నిర్ణయించాయి. ఆర్థిక అనిశ్చిత్తుల నేపథ్యంలో వ్యయాలను తగ్గించుకునే పనిలో ఈ చర్యలకు దిగాయి. 2022 అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో లక్ష్యాలను అందుకోలేకపోయామని, ఆదాయాలు పడిపోయినట్లు ఐబిఎం తెలిపింది. మరోవైపు పెట్టుబడులను నిలిపివేసే కార్యక్రమం కూడా జరుగుతుందని వెల్లడించింది. వ్యయాలను తగ్గించుకోవడం కోసం ఉద్వాసనలు తప్పడం లేదని పేర్కొంది. అయితే కొన్ని కీలక విభాగాల్లో నియామకాలు ఉంటాయని వెల్లడించింది. 2022లో ఐబిఎం 10 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని చేరాలని నిర్దేశించుకోగా.. 9.3 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యింది. నిర్వహణ మూలధన వ్యయాలు అంచనాలను మించడమే ఆదాయం తగ్గడానికి ప్రధాన కారణమని ఐబిఎం పేర్కొంది.

ఎస్‌ఎపిలో 2.5 శాతం మంది తొలగింపు

జర్మన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఎస్‌ఎపి (శాప్) ప్రస్తుత ఏడాదిలో 3వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. ఇది ఆ సంస్థలోని 2.5 శాతం మందికి సమానం. ఈ కంపెనీ సంప్రదాయ, క్లౌడ్ ఆధారిత కంప్యూటింగ్ సేవలను అందిస్తుంది. తమ ప్రధాన వ్యాపారాన్ని బలోపేతానికి వీలుగా చేపడుతున్న పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఈ కంపెనీలో ప్రపంచ వ్యాప్తంగా 1,20,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ఉద్యోగుల తొలగింపునతో దాదాపు రూ.2800 కోట్లు (350 మిలియన్ డాలర్లు) అదా అవుతాయని ఆ కంపెనీ అంచనా వేసింది.

రెట్టింపైన ఇండియన్ బ్యాంక్ లాభాలు

చెన్నయ్ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ లాభాలు రెట్టింపు అయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 102 శాతం వృద్ధితో రూ.1,396 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.690 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ3లో ఈ బ్యాంక్ నికర నిరర్థక ఆస్తులు 1 శాతానికి తగ్గడం విశేషం. 2021-22 ఇదే త్రైమాసికంలో 2.7 శాతం ఎన్‌పిఎ చోటు చేసుకుంది.

మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయము: మహీంద్రా టవర్స్, పి.కే.కుర్నే చౌక్, వర్లి, ముంబాయి-400 018
రీజనల్ ఆఫీస్ : ఇంటి నెం.54-1/2డి, 4వ అంతస్తు, శ్రీ సూర్య ప్రీమియర్, వెటర్నరీ కాలనీ, గుణదల, ఎన్‌హెచ్-5 రోడ్డు, విజయవాడ-520008

స్వాధీనతా ప్రకటన
(స్థిర ఆస్తి కొరకు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్సు - 2002 యొక్క రూలు 8(1) చూడండి

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 (54/2002) పరిధిలో మెసర్స్ మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇప్పటి నుండి "MRHFL"గా సూచితమైనది). సాధన హౌస్, 4వ అంతస్తు, మహీంద్రా టవర్స్, పి.కె. కర్నేచౌక్, వర్లీ, ముంబాయి-400018, మహారాష్ట్ర - ఇండియా వద్ద తమ రిజిష్టర్డు కార్యాలయం మరియు బ్రాంచి కార్యాలయం డోర్ నెం. 133-171, 1వ అంతస్తు, మెడ్‌ప్లస్ పైన, 3వ లైను, సాయినాథ్ కాలనీ, ఎంజీ ఇన్నర్ రింగ్ రోడ్డు, గుంటూరు - 522034 వద్ద కలిగియున్న సంస్థ అధీకృత అధికారిగా క్రింది సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్సు-2002 రూలు 3తో కూడిన 13(12) విభాగం క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలు / సహ-రుణ గ్రహీతలు / హామీదారులు అయిన (రుణగ్రహీత) **శ్రీ గుడిమెట్ల వీర లంకయ్య,** (సహ-రుణ గ్రహీత) **గుడిమెట్ల జ్యోతి** (హామీదారు) లను నోటీసులో తెలిపిన **రూ.4,48,127.00 (నాలుగు లక్షల నలభై ఎనిమిది వేల నూట ఇరవై ఏడు రూపాయలు మాత్రమే)** సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 దినములలోగా చెల్లించవలసినదిగా డిమాండ్ నోటీసు తేది **01 జులై 2022** జారీ చేసినారు. లోను అగ్రిమెంట్ నెం.**XSEMGUN00852202.**

పైన తెలిపిన రుణగ్రహీత సదరు మొత్తమును తిరిగి చెల్లించుటలో విఫలమైనారు, కనుక పైన తెలిపిన రుణగ్రహీతలు మరియు యావన్మంది ప్రజానీకమునకు తెలియచేయునది ఏమనగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్సు యొక్క 8వ రూలుతో కూడిన సదరుచట్టం 13వ విభాగం (4)వ ఉపవిభాగం పరిధిలో సంక్రమించిన అధికారాలతో దిగువ వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు **23 జనవరి 2023**న స్వాధీన పరచుకొనినారు.

ప్రత్యేకంగా పైన తెలిపిన రుణగ్రహీతలను మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు అట్టి లావాదేవీలు **రూ.4,48,127.00 (నాలుగు లక్షల నలభై ఎనిమిది వేల నూట ఇరవై ఏడు రూపాయలు మాత్రమే)** మరియు అందుపై వడ్డీ చెల్లింపునకు లోబడి మాత్రమే నిర్వర్తించవలెను.

చట్టంలోని 13వ విభాగం (8)వ ఉపవిభాగం పరిధిలో సెక్యూర్డ్ ఆస్తులు విడిపించుకొనుటకు రుణగ్రహీతకు తగిన సమయం లభించునని సూచించటమైనది.

స్థిర ఆస్తి వివరణ

గుంటూరు జిల్లా, తాడికొండ సబ్ డిస్ట్రిక్ట్, దామరపల్లి గ్రామ పంచాయతీ, దామరపల్లి గ్రామం, D.నెం: 146/1, సమీప డోర్ నెం. 3-40 మరియు విస్తీర్ణం 574 చదరపు అడుగులు లేదా 143 చ.గజాలు లేదా 119-56 చ.మీ. ఆర్‌సిసి ఇంటికి సరిహద్దులు: **ఉత్తరం :** పంచాయితీ బజారు : 41.5 అడుగులు, **దక్షిణం:** గుండ్లతోటి బ్రహ్మానాయుడు గారి ఆస్థి : 41.5 అడుగులు, **తూర్పు :** పంచాయితీ బజారు : 31.5 అడుగులు, **పడమర :** గుడిమెట్ల చంద్రరావు గారి ఆస్థి

ప్రదేశం: విజయవాడ
తేది: 23-01-2023
అధీకృత అధికారి
మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

సంపాదకీయం

నేరస్తులకు స్వేచ్ఛ!

ఎన్‌ఐఎ, సిబిఐ, ఇడి వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు, బిజెపి పాలిత రాష్ట్రాల్లోని పోలీసులు సాగిస్తున్న నిర్వాకంతో నిర్దోషులు జైళ్లలో మగ్గుతుంటే నేరస్తులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. పరివార్ పాలకులు తమ అనుయాయులకు అనుకూలంగా దర్యాప్తులను ప్రభావితం చేస్తున్న తీరు, తమను ప్రశ్నించేవారిని హింసిస్తున్న కక్షపూరిత వైఖరి దారుణంగా ఉన్నాయి. గుజరాత్ 2002 మత ఘర్షణల్లో పట్టపగలు వేలాది మంది ముస్లిం మైనార్టీలపై హత్యాకాండ సాగింది. ఈ ఘటనల్లో అరెస్టు చేయబడ్డ నిందితులు.. మెల్ల మెల్లగా నిర్దోషులుగా విడుదలవుతున్నారు. తాజాగా 14మంది నిందితులను నిర్దోషులుగా తేల్చుతూ హాలోల్ కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ సరైన ఆధారాలు సమర్పించలేదని కేసును కొట్టేసింది. మత ఘర్షణలు 2002లో జరగ్గా, చార్జిషీట్ 2004లో నమోదైంది. కోర్టు విచారణ 18 ఏండ్ల తర్వాత మొదలైందంటేనే ఆ రాష్ట్ర ప్రభుత్వ తాత్సారం ఎంతలా ఉందో బోధపడుతుంది. 'నేరం జరిగిన చోట నిందితుల పాత్ర ఉందని నిరూపణ కాలేదు. నిందితులు వాడిన కత్తులు, గొడ్డళ్లు వంటివేవీ కేసు విచారణ జరిపిన పోలీసులు సేకరించలేదు. ఆయుధాలు, పెట్రోల్, కిరసనాయల్ వంటి పదార్థాలు నేరం జరిగిన చోట వాడినట్టు ఆధారాలు లభ్యం కాలేదనీ కొంతమంది కనిపించలేదనే కారణంతో నిందితుల్ని దోషులుగా నిర్ధారించలేమ'ని న్యాయస్థానం అభిప్రాయపడింది. వీటినిబట్టి దోషులను రక్షించడానికి ప్రాసిక్యూషన్ ఎంత పక్షపాతంగా ఉందో విదితమవుతోంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లఖింపూర్ ఖేరీ ఘటనలో ప్రధాన నిందితుడైన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాకు మధ్యంతర బెయిల్ మంజూరయింది. 2021 అక్టోబర్ 3న లఖింపూర్ ఖేరీ జిల్లాలోని టికునియాలో అప్పటి ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పర్యటనను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న రైతులను ఆశిష్ మిశ్రా, తన అనుచరగణం వాహనాలతో తొక్కించడం వల్ల ఎనిమిది మంది రైతులు, జర్నలిస్టు మరణించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఆశిష్ మిశ్రాకు బెయిల్ లభించడం ప్రజలకు ఎటువంటి సంకేతాన్నిస్తుంది? అంతేగాక ఉన్నావో అత్యాచార నిందితులకూ బెయిల్ మంజూరయింది.

మరోవైపు భీమా కోరెగావ్ కేసులో నిందితులకు బెయిల్ మంజూరు చేయడానికి కేంద్రం ఆధీనంలోని ఎన్‌ఐఎ ఎన్ని వికృత వాదనలు చేస్తోందో లోకానికి తెలియనిది కాదు. పండు ముదుసలి, పార్కిన్‌సన్ వ్యాధిగ్రస్తుడైన ఫాదర్ స్టాన్ స్వామి జైలులోనే మగ్గి తుది శ్వాస విడిచిన దుస్థితి. ద్రవాహారం తీసుకోవడానికి స్ట్రా కూడా ఇవ్వడానికి నిరాకరించిన మహారాష్ట్ర పోలీసును ఏమనుకోవాలి? అలాగే 80 శాతానికి పైగా వైకల్యంతో బాధపడుతున్న ప్రొఫెసర్ సాయిబాబా బెయిల్ విషయంలో ఎన్‌ఐఎ ఎంత అమానుషంగా వ్యవహరించిందో చూశాం. జర్నలిస్టు సిద్ధికీ కప్పన్ కేసు గురించి యావత్ ప్రపంచ మీడియా విస్తుపోయిన వైనం మరో ఉదాహరణ. జైళ్లలో చిత్ర హింసలు, బెయిల్ నిరాకరణల గురించి ఇంకెన్నో... తప్పుడు కేసులు బనాయించడంలోనూ మన పోలీసులది అందె వేసిన చెయ్యి. సిఎఎ వ్యతిరేక ఆందోళనల సందర్భంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఢిల్లీ పోలీసులు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారో జగద్విదితం.

భారతీయ దర్యాప్తు సంస్థలు, పోలీసు వ్యవస్థ వృత్తి నైపుణ్యం, సామర్థ్యంలో పేరెన్నిక గన్నవే. ఎన్నో క్లిష్టమైన కేసుల్ని ఛేదించి ఘరానా మోసగాళ్లను కటకటాల వెనక్కు నెట్టిన ఘన చరిత్ర ఉన్నవే. అలాంటి వారు కొన్ని కేసుల్లో కనీస ఆధారాలు కూడా కోర్టులకు సమర్పించలేదంటే ఎవరూ నమ్మలేరు. ఇలాంటివాటికి నేరస్తులను రక్షించాలన్న ప్రభుత్వాల ఒత్తిళ్లే తప్ప వేరే కారణాలుండబోవు. అదే విధంగా నిర్దోషులు బయటకు రాకుండా నిర్బంధించే అమానుష, కర్కశ వాదనలు చేయడం, విషమ షరతులను విధించడం పాలకులు పోలీసును నిర్దేశించడం వల్లనేన్నది నిర్వివాదాంశం. సాధారణంగా న్యాయ వ్యవస్థ సాక్ష్యాధారాలనుబట్టి వ్యవహరిస్తుంది. కాని, దాన్ని కూడా తన గుప్పెటపెట్టుకోవాలని మోడీ సర్కారు చేస్తున్న కుటిల యత్నాలు చూస్తూనే ఉన్నాం. న్యాయం, ధర్మం నిష్పక్షపాతంగా ఉండాలి. నేరస్తులు జైళ్లలోనూ నిరపరాధులు స్వేచ్ఛగానూ ఉండాలి. ప్రజలు పాలకుల చేష్టలను పసిగట్టి కుట్రలను వమ్ము చేయాలి.

మహనీయుల మాట



విజయం కోసం ప్రయత్నించడమే జీవితం కాకూడదు.
విలువల కోసం జీవించడమే లక్ష్యం కావాలి.
- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్



కామెంట్

బడ్జెట్ ఎవరి కోసం?

భారతదేశ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు భయంకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్న తరుణంలో ఫిబ్రవరి 1వ తేదీన 2023-24 సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్ ముందు ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక పరిస్థితి గురించి మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ...కోవిడ్ మహమ్మారి వల్ల, భారత ప్రభుత్వం దాన్ని ఎదుర్కొన్న వినాశకరమైన తీరుతో తలెత్తిన దారుణమైన ప్రభావాల నుండి దేశ ఆర్థిక వ్యవస్థ ఇంకా కోలుకోవాల్సి వుంది.

గత బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుండి, ఉక్రెయిన్‌లో సైనిక ఘర్షణ తలెత్తడం, పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలతో అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితులు మరింత అధ్వాన్నంగా తయారయ్యాయి. అయినా, తాత్కాలికంగా ఏర్పడిన ప్రపంచ మాంద్యాన్ని ఎదుర్కొనడానికి భారత్ సన్నద్ధం కావాల్సి వుంది. పైగా, తాత్కాలికంగా ఏర్పడిన ఆర్థిక మాంద్యాన్నే కాకుండా ప్రపంచీకరణ సిద్ధాంతంలో వున్న వైరుధ్యాల ఫలితంగా దీర్ఘకాలం కొనసాగే పెట్టుబడిదారీ సంక్షోభాన్ని కూడా భారత్ ఎదుర్కొనాల్సి వుంది. వ్యవసాయ సంక్షోభం, వేతనాల స్తంభన, వీటికి తోడు అధిక వృద్ధి దశలతో పాటు పెరుగుతున్న నిరుద్యోగ సమస్య, ఉపాధి పొందిన కార్మిక వర్గాన్ని కూడా తీవ్రంగా దోచుకోవడానికి దారి తీయడం, అసమానతల్లో తీవ్రమైన పెరుగుదల వంటి వైరుధ్యాలను భారతదేశ ఆర్థికాభివృద్ధి కూడా ప్రతిబింబిస్తోంది. ఈ పరిస్థితులపై ఆధారపడిన పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమం, ఈ పరిస్థితులు కల్పించిన డిమాండ్ సమస్యల కారణంగానే దాని ఊపును, ఉత్తేజాన్ని కోల్పోతూ వస్తోంది. కోవిడ్ మహమ్మారి తలెత్తడానికి ముందు కూడా ఈ పరిస్థితి నెలకొనడం కనిపిస్తోంది. తొలుత వేసిన ముందస్తు అంచనాల ప్రకారం, 2022-23లో భారతదేశ వాస్తవిక తలసరి జాతీయాదాయం కరోనా మహమ్మారికి ముందు 2019-2020 స్థాయి కన్నా కేవలం 2.4 శాతమే అధికంగా వుంటుండగా, సంవత్సరానికి కేవలం ఒక శాతం అంతర్లీన వృద్ధి రేటు ధోరణి కన్నా తక్కువగానే వుండనుంది.

ఇదే కాలంలో ద్రవ్యోల్బణ రేట్లలో తీవ్రమైన పెరుగుదల కూడా కనబడుతోంది. 2019-20, 2022-23 మధ్య మూడు త్రైమాసికాల్లో నామమాత్రపు జిడిపి పెరుగుదల అనేది వాస్తవిక ఉత్పత్తి కన్నా ధరల్లో పెరుగుదల కారణంగా నమోదైంది. పారిశ్రామిక రంగంలో ఈ సంక్షోభం అత్యంత తీవ్రమైన రీతిలో ప్రతిబింబించింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 2022-23లో తయారీ రంగం కేవలం 1.6 శాతమే వృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది. రికవరీ అనేది తీవ్రమైన అసమానంగా వుంటుందని మోడీ ప్రభుత్వం అనుసరించిన వర్గ పక్షపాత దృక్పథం వల్ల తెలుస్తోంది. 2019-20, 2022-23 మధ్య కాలంలో నామమాత్రపు జిడిపిలో పెరుగుదల కన్నా ఎక్కువగా కార్పొరేట్, ఆదాయ పన్నుల ఆదాయాలు పెరగడమన్నది ఇందుకు రుజువుగా వుంది. పన్నుల రేట్లు పెరగని పరిస్థితుల్లో ఇది జరిగిందంటే ఇందుకు గల ఏకైక మార్గం మొత్తం జాతీయాదాయాల్లో కార్పొరేట్ లాభాలు, అధిక ఆదాయాల వాటా పెరగడమే. ఫలితంగా, ఆదాయాల్లో మొత్తంగా ప్రతిష్టంభన నెలకొన్న పరిస్థితుల్లో భారతదేశ కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోయింది. పెరిగిన నిరుద్యోగం, తక్కువ వేతనాల కారణంగా ఈనాటి వారి ఆదాయాలు 2019-20 లోని ఆదాయాలతో పోలిస్తే సగటు కన్నా తక్కువగానే వున్నాయి.

ఎలాంటి ముందస్తు ఆలోచన, ప్రణాళిక లేకుండా విధించిన లాక్‌డౌన్ లక్షలాదిమంది భారతీయులు కోవిడ్ కారణంగా మరణించకుండా నివారించలేకపోయింది. దీనికితోడు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అనుసరించిన విధానం కూడా ఈ సంక్షోభానికి దోహదపడింది. 2022 నవంబరు వరకు ఆదాయాలు, ఖర్చుల్లో ధోరణులు చూస్తే, 2022-23లో జిడిపిలో కేంద్ర పన్నుల వాటా (శాతం) 2019-20లో కన్నా అధికంగా వుండాలని సూచిస్తోంది. పైగా, వీటిల్లో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా గణనీయంగా అధికంగానే వుండాలి. కేంద్ర పన్నుల ఆదాయాల్లో రాష్ట్రాల వాటా తగ్గడమే ఇందుకు కారణంగా వుంటుంది. మిగిలిన ఆర్థిక సంవత్సరానికి ప్రస్తుత ధోరణే కొనసాగినట్లైతే, జిడిపిలో కేంద్ర ప్రభుత్వ వ్యయం కూడా 2019-20లో కన్నా తక్కువగా వుండాలి. అదీకాకుండా, ప్రత్యక్ష పన్నుల ద్వారా అదనపు ఆదాయం లభిస్తున్నప్పటికీ, గతంలో పెంచిన చమురు ధరల పెంపులను ఇంకా పూర్తిగా తగ్గించలేదు. ఆ రకంగా, అసమానతల పెంపు ధోరణికి విరుగుడు చర్యలు తీసుకోవడానికి బదులుగా మోడీ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక విధానాలు అసమానతలను మరింత తీవ్రం చేశాయి. డిమాండ్ తగ్గినటువంటి పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరచడంలో ప్రభుత్వం విఫలమైంది. ఆర్థిక వాస్తవికతలను పట్టించుకోని వైనం గతంలో కూడా స్పష్టంగా కనబడింది. కానీ, కరోనా మహమ్మారి, దాని పర్యవసాన ఆర్థిక ప్రభావాలకు సంబంధించి పెను మానవ విషాదాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ ఆ విధానాన్నే కొనసాగించేందుకు పట్టుబట్టడం ఇందుకు సంబంధించి క్రూరమైన కారణంగా వుంది. ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించే పేరుతో - ప్రభుత్వ ఆస్తులను మరింతగా ప్రైవేటీకరించడం, జాతీయాస్తుల మానిటైజేషన్ కార్యక్రమం, కొత్త వ్యవసాయ చట్టాలను ప్రవేశపెట్టేందుకు విఫల యత్నం, రక్షణ, బీమా వంటి రంగాల్లో మరింత విదేశీ పెట్టుబడులను అనుమతించడం వంటి ఇతర చర్యలు దీనికి తోడయ్యాయి. ఇవన్నీ కూడా కొద్దిమంది బడా పెట్టుబడిదారుల వద్దనే సంపద పోగుపడడమనేది బాగా పెరిగేందుకు మోడీ ప్రభుత్వం గుడ్డిగా నమ్మి అనుసరించిన నిబద్ధత లక్షణాలు. దానికి మతతత్వ రాజకీయాలను ముసుగుగా వాడుకుంటోంది.

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సుదీర్ఘమైన ఈ అంతరాయాలు, ఆటంకాలతో...భారత ఆర్థిక భవితవ్యమనేది నిజాయితీగల ఆత్మనిర్భరతపై ఆధారపడి వుంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో పోటీ పడేందుకు, కార్మిక వర్గాన్ని శాశ్వత దారిద్ర్యానికి నెట్టడం ద్వారా లాభాలను పిండేందుకు ప్రయత్నించడానికి బదులుగా... విస్తృతమైన దేశీయ మార్కెట్‌ను అందించడానికి కార్మిక వర్గ సామర్థ్యాన్ని మరింత స్వయంప్రతిపత్తితో కూడిన అభివృద్ధి పంథా కోసం ఉపయోగించుకోవాల్సి వుంది. ఇందుకోసం, వారికి అనుకూలంగా పంపిణీని మార్చడానికి, రైతుల ఆదాయాలను మెరుగుపరచడానికి, ఉపాధిని సృష్టించగల డిమాండ్ విస్తరణను పెంచడానికి పన్నులను విధించడాన్ని, ప్రభుత్వ వ్యయాన్ని పెంచడాన్ని ఉపయోగించుకోవడం అనివార్యం. తద్వారా మెరుగైన ఆరోగ్య, విద్యా ఫలితాలను పొందేందుకు వీలు కల్పిస్తుంది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో, ఇటువంటి ప్రాధాన్యతలను ప్రతిబింబించగల కేంద్ర బడ్జెట్ కోసం పోరాడేందుకు, వనరుల కొరతతో ప్రభుత్వం ఇబ్బందులు పడుతోందన్న వాదనను తోసిపుచ్చేందుకు వామపక్షాలు నిబద్ధతతో వున్నాయి.

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సుదీర్ఘమైన ఈ అంతరాయాలు, ఆటంకాలతో... భారత ఆర్థిక భవితవ్యమనేది నిజాయితీగల ఆత్మనిర్భరతపై ఆధారపడి వుంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో పోటీ పడేందుకు, కార్మిక వర్గాన్ని శాశ్వత దారిద్ర్యానికి నెట్టడం ద్వారా లాభాలను పిండేందుకు ప్రయత్నించడానికి బదులుగా... విస్తృతమైన దేశీయ మార్కెట్‌ను అందించడానికి కార్మిక వర్గ సామర్థ్యాన్ని మరింత స్వయంప్రతిపత్తితో కూడిన అభివృద్ధి పంథా కోసం ఉపయోగించుకోవాల్సి వుంది. ఇందుకోసం, వారికి అనుకూలంగా పంపిణీని మార్చడానికి, రైతుల ఆదాయాలను మెరుగుపరచడానికి, ఉపాధిని సృష్టించగల డిమాండ్ విస్తరణను పెంచడానికి పన్నులను విధించడాన్ని, ప్రభుత్వ వ్యయాన్ని పెంచడాన్ని ఉపయోగించుకోవడం అనివార్యం.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

జనవాక్యం

గ్రామీణ వలసలు కానరావా...

నానాటికి మన ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలపై శీతకన్ను వేస్తూ చిన్న తరహా నీటి ప్రాజెక్టులను సైతం సకాలంలో పూర్తి చేయడంలేదు. స్థానిక సంస్థల బకాయి నిధులు విడుదల చేయడంలేదు. ఉపాధి హామీ పని దినాలను తగ్గిస్తున్నారు. ఈ కారణాలతో తాగునీరు, సాగునీరు, ఉపాధి సక్రమంగా లభించక, కరువు కాటకాలతో గ్రామీణ రైతులు, రైతు కూలీలు పట్టణ బాట పట్టటం ఎక్కువైంది. ఈ వారంలోనే ఒక్క కర్నూలు జిల్లా గ్రామాల నుండి పదివేల మంది బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వెళ్ళారనే వార్తలు వెలువడ్డాయి. కన్నబిడ్డలను వృద్ధ తల్లి దండ్రులకు అప్పగించి కన్నతల్లి వంటి పుట్టి పెరిగిన ఊరు వదిలి వెళ్ళటం ఎవరికైనా బాధాకరమే. మరోవైపు అక్కడ వారి ఆలనా పాలనా లేక ఇక్కడ వీరికి సరైన ఉపాధి, ఆవాసం లేక ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇక పట్టణాలు, నగరాలు వలసల ప్రవాహంతో కిక్కిరిసి మురికి వాడలు, జల, వాయు కాలుష్యాల వంటి ఎన్నో సమస్యలకు తోడు కొత్తగా తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలతో, పౌర సేవలను సక్రమంగా అందించలేక స్థానిక యంత్రాంగాలు సతమతమవుతున్నాయి. గతంలో అమెరికా వంటి దేశాలు నగరాలపై ఒత్తిడి తగ్గించు కోవడానికి గ్రామీణ ప్రాంతాల్లో నివసించాలనుకునే వారికి ఎన్నో ప్రోత్సాహ కాలిచ్చాయి. తాజాగా జపాన్ ప్రభుత్వం కూడా ఈ బెడదను తప్పించుకోవటానికి గ్రామీణ ప్రాంతాల్లో నివసించ కోరే పట్టణ పౌరులకు ఆరు లక్షల రూపాయలను (మన కరెన్సీలో) ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించింది. అదే విధంగా మన ప్రభుత్వాలు కూడ తక్షణమే, గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా నివసించాలని భావించే వారికి కొంత ఆర్థిక సాయం చేసి అక్కడే వుండి ఉపాధి లేక వలసబాట పడుతున్న నిరుపేద కుటుంబాలకు కూడ పొలం పనుల సీజన్ వచ్చే వరకు ప్రతి నెలా కొంత ఆర్థిక సహాయం, రేషన్ బియ్యం, కందిపప్పు వంటి నిత్యావసరాలను ఉదారంగా అందించాలి. పనికి ఆహార పథకం రోజులు పెంచి గ్రామీణ చెరువులు, కాలువల మరమ్మతులు చేయించాలి. పాడి గేదెల కొనుగోళ్లకు నామ మాత్రపు వడ్డీలకు నిధులు మంజూరు చేయటం వంటి చర్యలతో పేద గ్రామీణులను ఆదుకోవాలి. అన్ని మండల కేంద్రాల్లో సమగ్ర విద్య, వైద్యం, ప్రభుత్వ సిబ్బందికి నివాస భవనాలు వంటి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. ఇకనైనా అసంపూర్తిగా మిగిలిపోయిన హంద్రీ నీవా, నగరి గాలేరు, వెలుగొండ, గత ఏడాది వరదకు కొట్టుకు పోయిన అన్నమయ్య వంటి చిన్న తరహా నీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలి. అప్పుడే గ్రామాల నుండి వరద ప్రవాహం తగ్గుతుంది. వలసలూ తగ్గుతాయి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, నరసరావుపేట.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఎవరు దేశభక్తులు? ఎవరు దేశద్రోహులు?

కామన్ సెన్స్

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 'వికాస్' అనే మాట తరచూ మాట్లాడుతూ ఉంది. అది అణగారిన వర్గాల రక్తమాంసాల్ని, మైనార్టీల అస్థిపంజరాన్ని కార్పొరేట్ శక్తులకు నైవేద్యం పెడుతూ దేశాన్ని ఏ ప్రగతి మార్గంలో నడిపిస్తోంది? దేశంలోని ప్రతి సగటు మనిషి గుండెమీద చేయివేసుకుని, తమకు తిండి, బట్టా దొరుకుతున్నాయా? అని-తమ పిల్లలకు సరైన చదువు చెప్పించగలుగుతున్నామా? అని ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది. ఈ దేశ ప్రజలకు ఆరోగ్య సదుపాయం, రవాణా సౌకర్యాలు సరిగా అందుతున్నాయా? యువతకు ఉపాధి లభిస్తోందా? రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకోగలుగుతున్నారా? అని ఆలోచించుకోవాల్సిన సమయం వచ్చింది. దేశ ప్రజల్ని మతాల ప్రాతిపదికన, కులాల ప్రాతిపదికన, ఆర్థిక స్తోమతల ప్రాతిపదికన విభజించి పాలిస్తూ 'దేశ్ కా వికాస్' ఎలా తేగలుగుతున్నారో ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. బ్రిటిష్‌వాడు విభజించి పాలించాడంటే అర్థం చేసుకోవచ్చు. వాడు విదేశీయుడు. ఇప్పుడు మరి వీరికేమయ్యింది? అందరం ఈ దేశ వాసులమే కదా?

మరి, ఈ దేశ ప్రజలకు ఏమైంది? అజ్ఞానానికి, మూర్ఖత్వానికి పట్టం కడుతున్నారు? ఆలోచించుకోవాల్సిన సమయం వచ్చింది.

దేశ భక్తుడు షహీద్ భగత్‌సింగ్ ఎందుకు గుర్తుకు రావడం లేదూ? ఈ దేశాన్ని రక్షించుకోవడానికి రక్తం చిందించిన అమరవీరులైన దేశభక్తులెవరూ ఎందుకు గుర్తుకు రావడం లేదూ? ఎందుకు దేశద్రోహులను, మోసగాళ్ళను గద్దెనెక్కిస్తున్నాము? మనం ఒక హిందూ, ఒక ముస్లిం, ఒక క్రైస్తవుడిగా పుట్టడమన్నది యాదృచ్ఛికం. ఎవరు, ఎక్కడ, ఏ ప్రాంతంలో పుట్టాలన్నది ఎవరి ఆధీనంలోనూ ఉండదు కదా? ఏది ఏమైనా, అందరం ఈ దేశ వాసులం. భారతీయులం. అంతకన్నా ముఖ్యం... అందరం మనుషులం! తేడాలెందుకూ? విభజనలెందుకూ? కుట్ర పూరితంగా విభజనలు ప్రోత్సహించే వారి ఆట కట్టించాలి కదా? అబద్ధాలు చెపుతూ పుకార్లు ప్రచారం చేసే వారి భరతం పట్టాలి కదా? కరోనా కష్ట కాలంలో లక్షలమంది వలస కార్మికులకు కనీసం రైలు, బస్సు సౌకర్యం కల్పించలేని ప్రభుత్వ అసమర్థత ఎందుకు కనిపించడం లేదూ? లక్షల కోట్లు బ్యాంకు దోపిళ్ళు చేసిన వారిని మాత్రం భద్రంగా దేశం దాటిస్తారా? అదేనా ఈ దేశ చౌకీదారు చేయాల్సిన పని? అధిక సంఖ్యాకులైన సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపలేని - 'ప్రజా సేవకులు' మనకు అవసరమా?

ఈ దేశంలోని యువతరాన్ని సంబోధిస్తూ దేశభక్తుడు షహీద్ భగత్‌సింగ్ చెప్పిన మాటలు ఇలా ఉన్నాయి... "భారత రిపబ్లిక్ లోని యువతీ యువకులారా! సిపాయిలారా! విశ్రాంతిగా, నిరర్థకంగా నిలబడకండి. అడుగులో అడుగు వేస్తూ కార్యోన్ముఖులు కండి. తీవ్రమైన ఆకలి, పేదరికం మీకు సవాలు విసురుతోంది! దాన్ని తిప్పికొట్టాల్సి ఉంది. మీరొక మంచి మిషన్ (ధ్యేయం)లో నిమగ్నమై ఉన్నారు. దేశం అన్ని వైపులా, అన్ని మూలల్లో విప్లవ జ్వాలలు అంటుకుంటున్నాయి. ప్రజల్ని సమాయత్తం చేయండి. వినిపిస్తున్న బిగుల్ ధ్వని (యుద్ధభేరి) వినండి. విని కదలండి. ఇలాగే నిశ్చేష్టులై నిస్సారంగా జీవితం గడపకండి.." భగత్‌సింగ్ ఆయన కాలంలో చెప్పిన మాటలు ఈ కాలానికి కూడా పనికొస్తాయి. అందువల్ల ఆయన కన్న కలల్ని నిజం చేయాల్సిన బాధ్యత ఈ తరం యువతీ యువకుల మీద ఉంది. వారంతా తీవ్రంగా ఆలోచించాలి. లేవాలి. లేచి, కార్యాచరణకు పూనుకోవాలి. లేకపోతే ఇంకా ఇంకా నష్టం జరిగిపోతుంది. ఆ తర్వాత పశ్చాత్తాపంలో కుమిలిపోయినా లాభం ఉండదు.

హిట్లర్ పరిపాలనా కాలంలో ఫాసిజాన్ని వ్యతిరేకించే ఒక కార్యకర్త, కవి పాస్టర్ నిమోలర్ ఒక కవిత రాశాడు. అది తెలుగులోకి తెస్తే ఇలా ఉంటుంది...

మొదట వాళ్ళు కమ్యూనిస్టుల కోసం వచ్చారు/ అప్పుడు నేనేం మాట్లాడలేదు-కారణం, నేను కమ్యూనిస్టుని కాదు కాబట్టి!/ తర్వాత వాళ్ళు ట్రేడ్ యూనియన్ వారికోసం వచ్చారు./ అయినా నేను మాట్లాడలేదు-/ కారణం, నేను ట్రేడ్ యూనియన్‌లో లేను కాబట్టి! / ఆ తర్వాత వాళ్ళు యూదుల కోసం వచ్చారు/ అప్పుడూ నేనేం మాట్లాడలేదు -/ కారణం, నేను యూదుణ్ణి కాదు కాబట్టి! / వాళ్ళు మళ్ళీ నాకోసం వచ్చారు - అంతే / అప్పటికి, నా గురించి మాట్లాడే వాళ్ళే మిగల్లేదు.

జరుగుతున్న అన్యాయాల సెగ మనకు తగలడం లేదు కదా అని తమాషా చూస్తూ ఉంటే, ఆ తర్వాత మన గురించి గొంతెత్తే వారే ఉండరు. సంఘ్ పరివార్, బీజేపీలు కలిసి ఆ హిట్లర్ పథకాన్ని ఇక్కడ ఈ దేశంలో అమలు చేయాలని అనుకుంటున్నప్పుడు - దేశ ప్రజలు ఏం చేయాలి? అన్యాయాల మీద, అబద్ధాల మీద, అరాచకాల మీద అజ్ఞానం మీద, మూర్ఖత్వం మీద, పుకార్ల మీద, కుట్రల మీద, మనుషుల విభజన మీద తీవ్రంగా విరుచుకుపడాలి కదా? ఓర్చుకుని, నోరుమూసుకుంటే అది మరింత వినాశనానికే దారితీస్తుంది. మానవ జాతి అంతా ఒక్కటే అయినప్పుడు, ఈ దేశ వాసుల్లోనే కొందరు మనవారు కొందరు పరాయివారు ఎలా అవుతారు? మన అన్నా తమ్ముళ్ళు అక్కా చెల్లెళ్ళు ఉత్తపుణ్యానికి చనిపోతూ ఉంటే, విభజించి పాలిస్తున్న ఈ పాలకులు గొప్ప పాలన అందిస్తున్నారని మనమిక్కడ వేడుకలు చేసుకుందామా?

దేశభక్తులు షహీద్ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు లు 20 మార్చి 1931న పంజాబ్ గవర్నర్‌కు ఒక లేఖ పంపించారు. అందులోని సారాంశం ఇలా ఉంది..."-మేం చెప్పదల్చుకున్నదేమంటే, ఇక్కడ యుద్ధం ప్రారంభం కానే అయ్యింది. శ్రామికుల శ్రమ శక్తిని అన్యాయంగా దోచుకుని బలిసిపోతున్న కార్పొరేట్లకు వ్యతిరేకంగా ఈ యుద్ధం కొనసాగుతుంది. దోచుకునే కార్పొరేట్లు బ్రిటిష వారయినా, స్వదేశీయులైనా మాకు ఒక్కటే... వాళ్ళంతా ఒక్కటై సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. జీవితాలు దుర్భరం చేస్తున్నారు. అందుకే చెపుతున్నాం. దోపిడీని, అణచివేతను ఇక ఎంతమాత్రమూ సహించం. రక్తం తాగేవాడు స్వదేశీయుడైతేనేమిటి? విదేశీయుడైతేనేమిటి? మాకు అందరూ శత్రువులే!"

ఆనాడు ఆ దేశ భక్తులు వెలిబుచ్చిన ఆవేదనను ఇప్పుడు ఈ దేశ ప్రజలందరూ మళ్ళీ వెలిబుచ్చాల్సిన అవసరం వచ్చింది. కారణం ఇప్పుడు సమకాలీనంలో కూడా అదే పరిస్థితి ఉంది.

"ఒకప్పుడు జర్మనీలో జరిగినట్టుగానే ఇప్పుడు భారతదేశంలో బీజేపీ ప్రభుత్వం - అసలు సమస్యల నుండి దృష్టి మరల్చడానికి మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ఉంది" అన్నారు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షులు జస్టిస్ మార్కండేయ కట్జూ.

అసలు సమస్యల నుండి దృష్టి మరల్చడానికి మన దేశ నాయకులు ప్రచారం చేస్తున్న అంశాలు: 1. పురాణాల్లో సైన్సు ఉంది. 2. మసీదులో లింగం ఉంది. 3. హిందీ భాషని దేశంలో తప్పనిసరి చేయాలి. 4. ముస్లింలను దేశం నుండి తరిమేయాలి. 5. ఘర్ వాపసీ - ఇతర మతాలలో ఉన్న వాళ్ళందరూ ఒకప్పుడు హిందువులే గనక వారందరూ మళ్ళీ ఇంటికి తిరిగి రావాలి. అంటే హిందువులుగా మారాలి. 6. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఈ దేశంలో ఎలాంటి హక్కులు ఉండకూడదు. 7. మొఘల్ చక్రవర్తులు దుర్మార్గులు. వారి కట్టడాలు, ఆనవాళ్ళు ఈ దేశంలో ఉండకూడదు. 8. స్త్రీల వస్త్రధారణ విధానాల వల్లనే రేప్‌లు జరుగుతున్నాయి. 9. ఆవు మూత్రం, ఆవుపేడలతో అన్ని రోగాలు నయం చేసుకోవచ్చు. 10. ఓం శబ్దం లోని మహత్తును నాసా కూడా గుర్తించింది - ఇలా ఇష్టం వచ్చిన విషయం మీద ఇష్టం వచ్చిన విధంగా అబద్ధాలు మాట్లాడుతూ దేశ ప్రజల్ని అయోమయంలో పడేయాలని వారు అనుకుంటున్నారు. అలా కాలక్షేపం చేస్తూ, అధికారంలో కొనసాగవచ్చు-నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచుకోవచ్చునన్నది వారి ఆలోచన!

ఐన్‌స్టీన్ లాంటి మహా శాస్త్రవేత్త, గోథే లాంటి మహా రచయిత, బెథోవెన్ వంటి మహా సంగీతకారుడు, కాంట్, నీషే, మార్క్స్ లాంటి గొప్ప తత్వవేత్తలు అందరూ జర్మన్లే. కాని 1933లో జర్మనీ-హిట్లర్ ఆధీనంలోకి రాగానే, పరిస్థితుల్ని పూర్తిగా మార్చేశాడు. సమస్యలన్నింటికీ యూదులే కారణమని ప్రచారం చేశాడు. ఆలోచనాపరుల మెదళ్ళలో కూడా విషం నింపాడు. ఫలితం ఏమైంది? సుమారు 60 లక్షల మంది యూదులను గ్యాస్ ఛాంబర్ లోకి పంపి హత్య చేయించాడు. చరిత్ర పుటల్లో కనీవినీ ఎరగని దుర్మార్గం అక్కడ జరిగిపోయింది. పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అదే ఫాసిజం పోకడలు ఇప్పుడు ఇక్కడ ఈ దేశంలో కూడా వున్నాయి. తమకు తాము దేశ భక్తులమని ప్రకటించుకున్న వారు, దేశ స్వాతంత్ర్యానికి ముందు గానీ తర్వాత గానీ చేసేదంతా దేశద్రోహమేనన్నది తేలిపోయిన తర్వాత, రగిలిపోతున్న ఈ దేశ ప్రజలు ఆచరణ లోకి దిగకుండా ఉంటారా? సామాన్యుల సంఘటిత శక్తిని తక్కువగా అంచనా వేసే ఈ పాలకులే భవిష్యత్తులో అవహేళనకు గురికాబోతున్నారు. నియంతలకు చరిత్ర ఏ గతి పట్టిస్తూ వచ్చిందో మనందరికీ బాగా తెలుసు!

(వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త)

"భారత రిపబ్లిక్ లోని యువతీ యువకులారా! సిపాయిలారా! విశ్రాంతిగా, నిరర్థకంగా నిలబడకండి. అడుగులో అడుగు వేస్తూ కార్యోన్ముఖులు కండి. తీవ్రమైన ఆకలి, పేదరికం మీకు సవాలు విసురుతోంది! దాన్ని తిప్పికొట్టాల్సి ఉంది. మీరొక మంచి మిషన్ (ధ్యేయం)లో నిమగ్నమై ఉన్నారు. దేశం అన్ని వైపులా, అన్ని మూలల్లో విప్లవ జ్వాలలు అంటుకుంటున్నాయి. ప్రజల్ని సమాయత్తం చేయండి. వినిపిస్తున్న బిగుల్ ధ్వని (యుద్ధభేరి) వినండి. విని కదలండి. ఇలాగే నిశ్చేష్టులై నిస్సారంగా జీవితం గడపకండి.."

డా॥ దేవరాజు మహారాజు

మార్చిలో పార్లమెంట్ మార్చ్

- ఎంఎస్‌పికి చట్టపరమైన హామీ కోసం సుదీర్ఘ పోరాటం
- కిసాన్ మహా పంచాయత్‌లో ఎస్‌కెఎం
- లక్షకు పైగా రైతులు హాజరు
- దేశవ్యాప్తంగా ట్రాక్టర్స్ మార్చ్ విజయవంతం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీలు ఇచ్చి, అమలు చేయకుండా వెనక్కి తగ్గిన కీలకమైన సమస్యల సాధన కోసం అఖిల భారత స్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వందలాది రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ప్రకటించింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా మార్చిలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఫిబ్రవరి 9న కురుక్షేత్రలో జాతీయస్థాయి ఎస్‌కెఎం సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపింది. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల ద్రోహం, కనీస మద్దతు ధర, పూర్తి రుణమాఫీ, ఇతర డిమాండ్లకు సంబంధించిన చట్టబద్ధమైన హామీపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎస్ కెఎం మెమొరాండం పంపించింది.

దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల రాజధానుల్లో ట్రాక్టర్స్ మార్చ్ నిర్వహించారు. దాదాపు 300 జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేశారు. వేలాది ప్రాంతాల్లో ప్రదర్శనలు, మార్చ్‌లు నిర్వహించారు. హర్యానాలోని జింద్‌లో నిర్వహించిన కిసాన్ మహాపంచాయత్‌కు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌తోపాటు ఇతర ఉత్తరాది రాష్ట్రాల నుంచి లక్ష మందికి పైగా రైతులు పాల్గొన్నారు. వీరిలో మహిళలే అధికంగా పాల్గొనడం విశేషం. ఎస్‌కెఎం నేత దర్శన్ పాల్ చారిత్రాత్మక రైతు ఉద్యమంలో మరణించిన 700 మందికి పైగా అమరవీరులకు సంబంధించి తీర్మానం ప్రవేశపెట్టారు. రైతులంతా ఒక నిమిషం మౌనం పాటించారు.

హర్యానాలోని జింద్‌లో నిర్వహించిన కిసాన్ మహాపంచాయత్‌కు భారీగా హాజరైన రైతులు

మరింత ఐక్యంగా పోరాటం : ఎస్‌కెఎం నేతలు

ఎస్‌కెఎం నాయకులు జోగేందర్ సింగ్ ఉగ్రహన్, దర్శన్ పాల్, రాకేష్ తికాయత్, హన్నన్ మొల్లా, విజూ కృష్ణన్, అవిక్ సాహా, యుద్వీర్ సింగ్, అతుల్ కుమార్ అంజన్, ఆశిస్ మిట్టల్ తదితరులు మహాపంచాయత్‌లో ప్రసంగిస్తూ తమ ఐక్యతను మరింత పటిష్టం చేయాలని, బిజెపి విభజన ఎత్తుగడలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎంఎస్‌పికి చట్టపరమైన హామీ సాధన కోసం సుదీర్ఘ పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. లఖింపూర్ ఖేరీ ఘటనతో సంబంధమున్న కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ మిశ్రాను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉపసంహరించుకోవాలని, రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను తీర్చేందుకు బడా కార్పొరేట్ల మద్దతుతో ఉన్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని జోగేందర్ సింగ్ ఉగ్రహన్ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు మోడీ పాలన అత్యంత రైతు, కార్మికుల వ్యతిరేక పాలన అని హన్నన్ మొల్లా అన్నారు. రైతులకు ద్రోహం చేస్తున్న బిజెపిని అధికారం నుంచి పారద్రోలడానికి ఐక్య పోరాటాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉందని చెప్పారు. హిందూ, సిక్కు ప్రాతిపదికన తమను విభజించేందుకు బిజెపి చేస్తున్న దుష్ప్రచారాన్ని భగ్నం చేసినందుకు హర్యానా, పంజాబ్ రైతులకు రాకేష్ తికాయత్ కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశానికి రండి

- కేజ్రీవాల్‌కు ఎల్‌జి ఆహ్వానం
- తిరస్కరించిన ఢిల్లీ సిఎం

న్యూఢిల్లీ : ఢిల్లీలో గురువారం కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం సమావేశమవుదామని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, మంత్రులు, 10 మంది ఆప్ ఎమ్మెల్యేలను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సెనా ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని కేజ్రీవాల్ సున్నితంగా తిరస్కరించారు. శుక్రవారం పంజాబ్ పర్యటనకు వెళుతున్నానని, కాబట్టి సమావేశానికి రాలేనని కేజ్రీవాల్ తెలిపారు. 'లెఫ్టినెంట్ గవర్నర్ గారికి కృతజ్ఞతలు. నేను రేపు పంజాబ్ పర్యటనకు వెళుతున్నాను. దీంతో సమావేశానికి మరొక సమయం కేటాయించాలని గౌరవనీయులైన లెఫ్టినెంట్ గవర్నర్‌కు విజ్ఞప్తి చేస్తున్నాను' అని సిఎం కేజ్రీవాల్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. లెఫ్టినెంట్ గవర్నర్ నివాసం ముందు గతవారం ఆప్ చేసిన ఆందోళన కారణంగా వికె సక్సెనా గురువారం ఈ ఆహ్వానాన్ని పంపారు. శిక్షణ కోసం 30 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల్ని ఫిన్లాండ్‌కు పంపే ప్రభుత్వ ప్రతిపాదనను గవర్నర్ తిరస్కరించారు. దీనికి నిరసనగా ఈ నెల 16న ఆప్ నిర్వహించిన ఆందోళనలో కేజ్రీవాల్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాఫ్రికాలో విద్యుత్ సంక్షోభం !

- భారీగా విద్యుత్ కోతలను నిరసిస్తూ ఆందోళనలు

జోహాన్నెస్‌బర్గ్ : దక్షిణాఫ్రికాలో రికార్డు స్థాయిలో విద్యుత్ కోతలను నిరసిస్తూ ప్రజలు ఆందోళనలు చేపట్టారు. దేశంలో సుదీర్ఘంగా నెలకొన్న ఇంధన సంక్షోభాన్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జోహాన్నెస్‌బర్గ్ వీధుల్లో ప్రజలు ప్రదర్శనలు నిర్వహించారు. పాలక ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లిన వారిలో చాలామంది ప్రధాన ప్రతిపక్ష పార్టీ డెమొక్రటిక్ అలయన్స్ పతాకం రంగు అయిన నీలి రంగులో దుస్తులు ధరించారు. జరిగింది చాలు, ప్రజలకు విద్యుత్ కావాలి అంటూ నినాదాలు చేశారు. విద్యుత్ కోతలతో ఉపాధులు పోతున్నాయని విమర్శించారు. కేప్‌టౌన్‌తో సహా పలు చోట్ల ప్రదర్శనలు జరిగాయి. డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంలో, కాలం చెల్లిన బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సదుపాయాల నిర్వహణలో ప్రభుత్వ ఇంధన సంస్థ ఎస్కామ్ విఫలం కావడంతో ఏళ్ల తరబడి దక్షిణాఫ్రికాలో విద్యుత్ సంక్షోభం నెలకొంటూనే వుంది. ఏడాది కాలంగా ఈ విద్యుత్ కోతలు మరింత దారుణంగా తయారయ్యాయి. దాదాపు సగం రోజు విద్యుత్ వుండని పరిస్థితి కూడా నెలకొంటోంది. దేశంలో 90శాతం విద్యుత్ అవసరాలను ఎస్కామ్ తీరుస్తుంది. ఇటీవల విద్యుత్ ఛార్జీల పెంపును ఆమోదించడం పట్ల చాలామంది ఆగ్రహంతో వున్నారు. విద్యుత్ కోతలతో దేశవ్యాప్తంగా వాణిజ్య, పారిశ్రామిక రంగం కుదేలైంది. పాలను నిల్వ చేయలేకపోతున్నామని పాల ఉత్పత్తిదారుల సంస్థ తెలిపింది. ప్రజలు విసిగిపోయారని వారి ఆందోళనను అర్థం చేసుకోగలమని అధ్యక్షుడు సిరిల్ రమాఫోస వ్యాఖ్యానించారు. విద్యుత్ సంక్షోభం దేశాన్ని ధ్వంసం చేస్తోందని అంగీకరిస్తూ, ఒక్కరాత్రిలో పరిష్కారం దొరకదని అన్నారు.

క్షీణించిన పాక్ రూపాయి !

- ఐఎంఎఫ్ రుణాల కోసం పరిమితి తొలగింపు

న్యూఢిల్లీ : పాకిస్తాన్ కరెన్సీ గురువారం మరింత క్షీణించింది. అమెరికా డాలరుతో రికార్డు స్థాయిలో 255 పాక్ రూపాయల మారక విలువ నమోదైంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి అవసరమైన రుణాలు పొందేందుకు గానూ మారకం రేటుపై పట్టును ప్రభుత్వం సడలించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. బుధవారం నుండి డాలరు - రూపాయి మారకం రేటుపై గల పరిమితిని పాకిస్తాన్ మనీ ఎక్స్ఛేంజ్ కంపెనీలు తొలగించాయి. బహిరంగ మార్కెట్‌లో స్థానిక కరెన్సీ నెమ్మదిగా క్షీణించడానికి ఇది అవకాశం కల్పిస్తుందని తెలిపాయి. రూ.24 క్షీణించిన పాక్ కరెన్సీ మధ్యాహ్నం ఒంటిగంటకు అమెరికా డాలరుతో రూ.255 వద్ద ట్రేడింగ్ అయింది. ప్రభుత్వ పరిమితిని ఎత్తివేసి, మార్కెట్ శక్తులే కరెన్సీ రేటును నిర్ణయించేందుకు అవకాశం ఇవ్వాలని ఐఎంఎఫ్ కోరింది. పాక్ ప్రభుత్వం ఆ షరతును వెంటనే ఆమోదించి తీసుకున్న చర్యలతో పరిస్థితి ఒక్కసారిగా దిగజారింది. గతేడాదే ఐఎంఎఫ్ బెయిలవుట్‌ను పొందినా, ఈ ఏడాది నిధుల విడుదల నిలిచిపోయింది. విదేశీ మారక నిల్వలు క్షీణించడంతో పాక్‌లో పెద్ద ఎత్తున ఆహార ద్రవ్యోల్బణం నెలకొంది. దేశంలో కొన్ని ప్రాంతాల్లో కిలో గోధుమ పిండి రూ.3వేల వరకు ధర పలుకుతోంది. మరోవైపు ఇంధన సంక్షోభంతో దేశంలో తరచుగా విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. సుదీర్ఘంగా సాగుతున్న విద్యుత్ కోతలతో చేయడానికి పని లేకుండా పోతోందని కార్మికులు వాపోతున్నారు. పెరుగుతున్న ధరలపై పోరు సల్పేందుకు గానూ 24ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా పాకిస్తాన్ రిజర్వ్ బ్యాంక్ ఈ వారం వడ్డీ రేట్లను పెంచింది.

ఘనంగా గణతంత్రం

- ఎపికి చెందిన ప్రభల తీర్థం శకటం ప్రదర్శన
- ముఖ్య అతిథిగా ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫట్టా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ వ్యాప్తంగా 74వ గణతంత్ర దినోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన ఈ వేడుకల్లో విభిన్న సంస్కృతులను చాటేలా శకటాల ప్రదర్శన జరిగింది. సైనిక శక్తిని ప్రదర్శిస్తూ త్రివిధ దళాలు కవాతు నిర్వహించాయి. వీటిల్లో నారీ శక్తి, అగ్ని వీరులు ప్రధాన ఆకర్షణగా మారారు. 17 శకటాలు ప్రదర్శించారు. అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన "ప్రభల తీర్థం - మకర సంక్రాంతికి వ్యవసాయదారుల పండుగ" ఇతివృత్తంతో శకటాన్ని ప్రదర్శించింది.

రక్షణ దళాల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకం కింద నియమితులైన అగ్నివీరులు మొట్టమొదటిసారి కవాతులో పాల్గొన్నారు. గతంలో రాజ్‌పథ్‌గా పిలిచిన మార్గానికి 'కర్తవ్యపథ్'గా పేరు మార్చిన తరువాత తొలిసారి ఇక్కడ కవాతు జరిగింది. స్వయం సమృద్ధ భారత్ పథకంలో భాగంగా మన దేశంలోనే తయారు చేసిన 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌తో 21సార్లు పేల్చి గౌరవ వందనం చేశారు. ఈ తుపాకులతో గౌరవ వందనం చేయడం ఇదే తొలిసారి. గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథిగా ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫట్టా ఎల్-సిసి హాజరయ్యారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఈజిప్టు నేతను ఆహ్వానించడం ఇదే మొదటిసారి. ఆ దేశ సైన్యం మనదేశ గణతంత్ర దినోత్సవ కవాతులో తొలిసారి పాల్గొంది.

ద్రౌపది ముర్ము రాష్ట్రపతి హోదాలో గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొనడం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా ఆమె తన స్వరాష్ట్రమైన ఒరిస్సా సంస్కృతిని ప్రదర్శించే విధంగా ఆ రాష్ట్రంలో తయారైన టెంపుల్ బోర్డర్ గల పట్టుచీరను ధరించారు. ఒంటెల దళంతో మహిళలు కవాతు నిర్వహించడం ఇదే తొలిసారి. వీరు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బి ఎ స్ ఎ ఫ్) కు చెందినవారు. సోనాల్, నిషా, భగవతి, అంబిక, కుసుమ్, ప్రియాంక, కౌసల్య, కాజల్, భావన, హీనా తదితరులు ఈ దళంలో ఉన్నారు. అందరూ మహిళలే ఉన్న సిఆర్‌పిఎఫ్-పీస్‌కీపర్స్ ఆఫ్ ది నేషన్ కంటింజెంట్ కూడా కవాతు నిర్వహించింది. దీనికి అసిస్టెంట్ కమాండెంట్ పూనమ్ గుప్తా నాయకత్వం వహించారు. ఉమెన్ ఆర్మ్‌డ్ పోలీస్ బెటాలియన్ ఏర్పాటవడం ప్రపంచంలో ఇదే తొలిసారి. మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేస్తున్న నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో మొట్టమొదటిసారి ఓ శకటాన్ని ప్రదర్శించింది. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడానికి వ్యతిరేకంగా ఈ శకటాన్ని తీర్చిదిద్దింది. 35 మంది మహిళా కానిస్టేబుళ్లతో ఢిల్లీ పోలీస్ ఉమెన్ పైప్ బ్యాండ్ ఈ కవాతులో పాల్గొనడం కూడా ఇదే మొదటిసారి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ రంగురంగుల తలపాగా ధరించారు. తెల్లని కుర్తా, ప్యాంట్, ఆ పైన నల్లని కోటు ధరించిన మోడీ పొడవైన వస్త్రం వేలాడే విధంగా అనేక రంగులతో కూడిన రాజస్థానీ తలపాగా ధరించడం విశేషం.

గణతంత్ర వేడుకల్లో కేరళ నారీశక్తి శకటం

రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే

దేశభక్తికి ప్రతీక

సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ : రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే దేశభక్తికి ప్రతీక అని సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేశారు. " భారత రాజ్యాంగం అందరికీ సమన్యాయం కల్పిస్తున్నది. దీంతోపాటు సమైక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తున్నది. మనకు ఉన్న హక్కులు, బాధ్యతలు, మౌలిక అధికారాలను వినియోగించుకునేందుకు వీలుగా రాజ్యాంగం రూపకల్పన జరిగింది. అన్ని వర్గాలకూ న్యాయం దక్కేలా లిఖించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లోనూ సమానంగా ఉండాలని స్పష్టంగా ప్రస్తావించింది. అయితే రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక సూత్రాలపై దాడులు జరుగుతున్నాయి. గత ఏడెనిమిదేళ్లుగా సంపన్నులు శతకోటీశ్వరులవుతుంటే.. పేదలు మరింత అట్టడుగుస్థాయికి దిగజారుతున్నారు. ఇది ఆర్థిక అంతరాల్లోనే కాకుండా సామాజిక అంశాల్లోనూ వారికి సమన్యాయం దక్కటంలేదు .అల్పసంఖ్యాక వర్గాలపై ప్రాణాలు తీసేలా హంతకదాడులు జరుగుతున్నాయి. దేశ సమానత, సమగ్రత అంటేనే సమన్యాయం. కానీ అలా ఎక్కడా జరగటం లేదు. దళితులు, ఆదివాసీలు, మహిళలపై అంతులేని అరాచకాలతో భయోత్పాతం కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని కాపాడుకోవటంతోపాటు.. మనకు రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైంది" అని ఏచూరి పిలుపునిచ్చారు.

రాష్ట్ర రాజధానులపై సుప్రీంలో మరో పిటిషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతిపై హైకోర్టు గతేడాది మార్చిలో ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. రాజధానిని రెండు, మూడుగా విభజించే అధికారం శాసనసభకు లేదంటూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గతేడాది మార్చి 3న ఇచ్చిన తీర్పును పక్కన పెట్టాలని గుంటూరు జిల్లా పేరేచర్లకు చెందిన మస్తాన్ వలీ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టులో దాఖలైన పిటిషన్‌లో పిటిషనర్లు ఉపశమనాలు కోరనప్పటికీ హైకోర్టు శాసనసభకు అధికారాలు లేవంటూ ఇచ్చిన తీర్పు చట్టబద్ధం కాదని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం శివరామకృష్ణన్ నేతృత్వంలోని కమిటీ ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ రాజధాని ఏర్పాటుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలని నివేదిక సమర్పించిందని తెలిపారు. ఆ నివేదికకు విరుద్ధంగా రాష్ట్ర హైకోర్టు అభివృద్ధి అంతా ఒకే ప్రాంతంలోనే చేయాలంటూ తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. హైకోర్టు గతేడాది ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పలువురు రైతులు సుప్రీం కోర్టులో గతంలోనే పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లపై ఈ నెల 31న సుప్రీంకోర్టు విచారణ జరపనుంది.

కేరళలో బిసిసి డ్యాకుమెంటరీ ప్రదర్శించిన కాంగ్రెస్

తిరువనంతపురం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై బిబిసి డాక్యుమెంటరీని కేరళ కాంగ్రెస్ విభాగం గురువారం ప్రదర్శించింది. రాజధాని తిరువనంతపురంలోని షణ్ముగామ్ బీచ్ వద్ద భారీ తెరపై ఈ డాక్యుమెంటరీని కాంగ్రెస్ నాయకులు ప్రదర్శించారు. భారీ సంఖ్యలో ప్రజలు దీనిని తిలకించారు. గుజరాత్ 2002 అలర్లకు మోడీదే ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ బిబిసి రెండు భాగాలుగా డాక్యుమెంటరీని ప్రసారం చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండో భాగం బుధవారమే బిబిసి లండన్ ద్వారా ప్రసారమైంది. ఈ డాక్యుమెంటరీని కేంద్రం నిషేధించింది. ప్రచారం కోసమే ఈ డాక్యుమెంటరీని బిబిసి రూపొందించిందని కేంద్రం ఆరోపించింది. రాహుల్‌గాంధీ జమ్ములో మాట్లాడుతూ కేంద్రం సెన్సార్‌షిప్‌ను ప్రశ్నించారు. 'సత్యం అత్యంత వెలుగుతో ప్రకాశిస్తుంది. సత్యానికి ఎప్పటికైనా బయటకు వచ్చే అలవాటు ఉంది. కాబట్టి ఎన్ని నిషేధాలు విధించినా, అణచివేత చర్యలు చేపట్టినా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా.. సత్యాన్ని బయటకు రాకుండా ఆపలేరు' అని రాహుల్ గాంధీ అన్నారు.

9 మంది పాలస్తీనీయుల హత్య

- ఇజ్రాయిల్ సైన్యం దురాగతం

వెస్ట్‌బ్యాంక్ : పాలస్తీనాలో ఇజ్రాయిల్ సైన్యం దురాగతాలు ఆగడం లేదు. గురువారం 60 ఏళ్ల మహిళసహా తొమ్మిది మంది పాలస్తీనీయుల్ని దారుణంగా హత్య చేసింది. వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థుల శిబిరంపై ఇజ్రాయిల్ సైన్యం జరిపిన కాల్పుల్లో తొమ్మిది మంది పాలస్తీయులు మరణించినట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. గురువారం శరణార్థుల శిబిరంతోపాటు వెస్ట్‌బ్యాంక్‌లోని ఒక ఆసుపత్రిపై ఇజ్రాయిల్ సైన్యం దాడులు జరిపిందని పేర్కొన్నారు.

ఇజ్రాయిల్ సైన్యం టియర్ గ్యాస్ ప్రయోగించడంతో అనేక మంది రోగులు, బంధువులు ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయుధులు ఉన్నారనే సమాచారంతోనే ఈ దాడులు చేశామని ఇజ్రాయిల్ సైన్యం తన దారుణాన్ని సమర్థించుకుంది. ఇజ్రాయిల్ సైన్యం దాడుల్లో 2023లో ఒక నెల కూడా పూర్తి కాకముందే ఇప్పటి వరకూ 29 మంది మరణించారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. అనేక మంది పాలస్తీనీయుల్ని ఇజ్రాయిల్ సైన్యం అక్రమంగా అదుపులోకి తీసుకుంది.

టీచర్లుగా వర్గీకరించండి

- కర్ణాటకలో అంగన్వాడీ వర్కర్ల డిమాండ్
- చలిలో రోడ్ల పైనే మహిళల నిద్ర

బెంగళూరు : తమను టీచర్లుగా వర్గీకరించాలన్న ప్రధాన డిమాండ్‌తో కర్నాటకలోని అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన చేస్తున్నారు. వేలాది మంది ఈనెల 23 నుంచి వారు నిరసనలో ఉన్నారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కు వద్ద గత రెండు రోజుల నుంచి తీవ్ర చలిలోనే నిద్రిస్తున్నారు. అయితే మహిళలు చలిలో, అర్ధరాత్రుళ్లు ఇబ్బంది పడుతున్నప్పటికీ.. ప్రభుత్వం నంచి ఎలాంటి స్పందనా రాకపోవటం గమనార్హం. నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) ద్వారా నూతన ప్రీ ప్రైమరీ స్కూళ్లు తెరుచుకుంటాయనీ, దీంతో చివరకు అంగన్వాడీలు తగ్గుతాయని సిఐటియు కర్ణాటక అధ్యక్షురాలు వరలక్ష్మి అన్నారు. దీనికి బదులు ఎల్‌కెజీ, యూకేజీలను అంగన్వాడీలలో ఏర్పాటు చేయాలనీ, వర్కర్లకు కేవలం ఐసీడీఎస్ కు సంబంధించిన పనులనే అప్పగించాలని తెలిపారు. అలా అయితే వారు ప్రీ ప్రైమరీ విద్యపై చక్కగా శ్రద్ధ పెట్టగలుగుతారని అన్నారు. అలాగే, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆహారాన్ని అంగన్వాడీ కేంద్రాల వద్దే వండేలా ఫుడ్ సరఫరాని వికేంద్రీకరణ చేయాలని వివరించింది.కోలార్ జిల్లాకు చెందిన సిఐటియు మండల అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ.. " అంగన్వాడీ వర్కర్ల విషయంలో చారిత్రక అన్యాయం కొనసాగుతున్నది. కారణం.. వారిని కార్మికులుగా (వర్కర్లు) గుర్తించటం లేదు. మేము చేసేది నిరవధిక దీక్ష. ప్రభుత్వానికి మేము పది డిమాండ్లు పెట్టాము. మా కుటుంబాలను వదిలి మరి మా లక్ష్యాలను సాధించడానికి ఇక్కడికి వచ్చాము. మమ్మల్ని టీచర్లుగా గుర్తించాలి. గ్రాట్యుటీ చెల్లింపులకు మమ్మల్ని అర్హులు చేయాలి." అని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో తమపై పని భారం పడుతున్నదనీ, వేధింపులను ఎదుర్కోవాల్సి వస్తున్నదని సుజాత అన్నారు. అంగన్వాడీలో పుస్తకాల నిర్వహణ, 'పోషణ్' అప్లికేషన్‌లో ఎప్పటికప్పుడు సమాచారాన్ని నమోదు చేయడం వంటివి అదనపు భారాన్ని మోపుతున్నాయని తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా తమను బూత్ స్థాయి అధికారులుగా నియమించడం పని భారాన్ని పెంచుతున్నదని అన్నారు. మండల స్థాయి సమావేశాలను అధికారులు ఏర్పాటు చేస్తే అక్కడకు తప్పక వెళ్లాల్సి ఉంటుందనీ, దీనికి హాజరు కావడానికి ఆ రోజు అంగన్వాడీ కేంద్రాలను మూసివేస్తే మానసిక వేదింపులకు గురవుతామని తెలిపారు. అయితే, తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆందోళనకారులు స్పష్టం చేశారు.

అదానీపై ఆరోపణలు వాస్తవమే

- రిపోర్టులకు కట్టుబడి ఉన్నాం
- కేసు వేస్తే మేము రెడీ
- హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వెల్లడి

న్యూఢిల్లీ : గౌతం అదానీకి చెందిన అదానీ గ్రూపు తన షేర్లలో అవకతవకలకు పాల్పడుతోందని.. ఎకౌంట్స్‌లోనూ మోసాలు చేస్తోందని తాము ఇచ్చిన రిపోర్టులకు కట్టుబడి ఉన్నామని అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల పరిశోధక సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ స్పష్టం చేసింది. తమ సంస్థపై ద్వేషంతో ఆధారాలు లేకుండా హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేసిందని అదానీ గ్రూపు స్టాక్ ఎక్స్చేంజీలు, రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. హిండెన్‌బర్గ్ రిపోర్టును తప్పుబట్టింది. దీనిపై హిండెన్‌బర్గ్ గురువారం ఘాటుగా స్పందించింది. తాము ఇచ్చిన రిపోర్టు సరైనదని.. లేకపోతే ఆ కంపెనీ చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. అదానీ గ్రూపు చేతనైతే తమపై కోర్టుకెళ్లాలని సవాలు విసిరింది. తమ సంస్థ అమెరికా నుంచి పనిచేస్తోందని.. కాబట్టి అక్కడ దావా వేసుకోవచ్చని సూచించింది. ఒకవేళ ఈ విషయంలో అదానీ గ్రూప్ కనుక విఫలమైతే తమ వాదనలు సరైనవిగా భావించాలని సవాల్ విసిరింది. అదానీ గ్రూపులో గతంలో పనిచేసిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, వేలాది పత్రాలు, ప్రభుత్వ, అంతర్జాతీయ సంస్థల నిఘా నివేదికలు, అదానీ గ్రూపు కంపెనీల శాఖలు ఉన్న 12కు పైగా దేశాలను పర్యటించి ఈ నివేదికను తయారు చేసినట్టు హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తెలిపింది. "మా రిపోర్టును విడుదల చేసి 36 గంటలు దాటిన ఒక్క అంశాన్ని కూడా అదానీ గ్రూపు స్పష్టంగా లేవనెత్తలేకపోయింది. మేము సూటిగా 88 ప్రశ్నలు వేశాము. ఇందులో అదానీ గ్రూపు ఏ ఒక్క ప్రశ్నకు ఇప్పటికీ బదులు ఇవ్వలేకపోయింది. రెండు ఏళ్లుగా అనేక పరిశోధనలు చేసి 32,000 పదాలతో 106 పేజీల రిపోర్టును రూపొందించాము. ఇందులో ఏ తప్పు ఉన్న మాపై న్యాయ చర్యలు తీసుకోవచ్చు. అదానీ గ్రూపు మా రిపోర్టును తప్పుబడుతూ చర్యలు తీసుకుంటామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాము. మేము ఇచ్చిన రిపోర్టుకు కట్టుబడి ఉన్నాము." అని హిండ్‌బర్గ్ రీసెర్చ్ ఓ ప్రకటనలో తెలిపింది. అదానీ గ్రూపు దావా వేస్తే తాము కూడా లీగల్‌గా ఆ కంపెనీ డాక్యూమెంట్లను కోరుతామని స్పష్టం చేసింది.

హిండెన్‌బర్గ్ రిపోర్టులోని ప్రధానాంశాలు... "అదానీ గ్రూపు సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన కుటుంబ సభ్యులు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఆ కంపెనీ షేర్లను మానిప్యులేషన్ చేస్తుంది. ఎకౌంట్స్‌లో మోసాలకు పాల్పడుతుంది. షేర్ల ధరలను కృత్రిమంగా పెంచింది. పన్ను ఎగవేత, మనీలాండరింగ్ మోసాల కోసం అనేక అడ్డదారులు తొక్కింది. అప్పుల కోసం మోసాలకు పాల్పడింది. కార్పొరేట్ ప్రపంచ చరిత్రలో ఇదో అతిపెద్ద కుట్ర. గౌతమ్ అదానీ నికర సంపద విలువ ప్రస్తుతం 120 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.9.78 లక్షల కోట్లు)గా ఉంది. మూడేళ్ల క్రితం ఇది 20 బిలియన్ డాలర్లు (రూ.1.62 లక్షల కోట్లు)గా ఉండేది. గత మూడేళ్లలోనే తన గ్రూప్‌నకు చెందిన 7 ప్రధాన లిస్టెడ్ కంపెనీల ముఖ విలువను ఎక్కువ చేసి, షేర్ల విలువను కృత్రిమంగా పెంచి ఆదానీ మోసానికి పాల్పడ్డారు. ఈ సమయంలో ఆయా కంపెనీల షేర్ విలువ సగటున 819 శాతం పెరిగింది. దీంతో మూడేళ్లలోనే అదానీ సంపద 100 బిలియన్ డాలర్లకు పైగా (రూ. 8.1 లక్షల కోట్లు) పెరిగింది. ఈ ఏడు కంపెనీలు 85 శాతం నష్టాలను నమోదు చేశాయి. ఇవి రెడ్‌జోన్‌లో ఉన్న కంపెనీలు. అయినప్పటికీ.. ఆర్థిక అవకతవకలతో ఆయన ఈ కంపెనీల నష్టాలను బయటపెట్టలేదు. నష్టాలతో ట్రేడ్ అవుతున్న ఆ కంపెనీల వాటాలను తనఖా పెట్టి అదానీ గ్రూప్ భారీగా రుణాలను పొందింది. దీంతో అదానీ కంపెనీ వాటాదార్ల సొమ్మును, గ్రూప్ ఆర్థిక పరిస్థితిని ప్రమాదంలో పడేసినట్టే. అదానీ గ్రూప్ మనీలాండరింగ్, అవినీతి ఆరోపణలకు గానూ భారీగా డబ్బు వెచ్చించింది. రూ.1.4 లక్షల కోట్ల అవినీతి, మనీలాండరింగ్, పన్ను ఎగవేతకు సంబంధించి అదానీ గ్రూప్ ఇప్పటికే నాలుగు కేసుల్లో ప్రభుత్వ సంస్థల విచారణను ఎదుర్కొంటుంది." అని ఈ రిపోర్టు తెలిపింది.

జపాన్ సమీపంలో మునిగిన నౌక

8 మంది మృతి

టోక్యో : జపాన్‌కు సమీపంలోని సముద్రంలో నౌక మునిగిపోవడంతో ఎనిమిదిమంది మరణించారు. మృతుల్లో ఆరుగురు చైనా దేశీయులు. చైనా నుంచి మయన్మార్‌కు సిబ్బందితో వెళుతున్న 'జిన్ తైయాన్' నౌక జపాన్‌కు నైరుతి దశగా 110 కిలో మీటర్ల దూరంలో బుధవారం తెల్లవారుజామున మునిగిపోయింది. మొత్తం 13 మంది సిబ్బందిలో ఐదుగురు సిబ్బందిని జపాన్ కోస్ట్‌గార్డ్, సైన్యం రక్షించాయి.

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి క్యూబా, వెనిజులా కృషి

కారకాస్ : అమెరికా ఆంక్షల్ని ఎదుర్కోవడానికి వెనిజులా, క్యూబా ఇరు దేశాలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అమెరికా నిబంధనల్ని ప్రతిఘటించే నేపథ్యంలో ఇరు దేశాల మధ్య బంధం బలపడేందుకు కృషి చేస్తున్నాయి. తాజాగా ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించుకునేందుకు ఇరు దేశాల అధ్యక్షులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి బుధవార వెనిజులా వెళ్లిన క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కనెల్... ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోని కలిసి ఇరు దేశాల సంబంధాలపై చర్చించినట్లు వెనిజులా మీడియా వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఇరుదేశాల అధ్యక్షులు కలిసి దిగిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ అయినట్లు వెనిజులా మీడియా పేర్కొంది. ఇక ఈ సమావేశంలో క్యూబా అధ్యక్షుడితోపాటు ఆ దేశ వాణిజ్య మంత్రి రోడ్రిగో మాల్మీర్కా డియాజ్, విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిజ్జెలు పాల్గొన్నారు.

మీకోసం

యాపిల్ ముక్కలపై కాస్తంతా ఉప్పు చల్లితే రంగు మారవు.

జీవన సౌరభం

మేధావులు మౌనం వహించినంత కాలం, మూర్ఖులు రాజ్యాలు ఏలుతారు.

ఆది, అంత్యప్రాసల గేయం

చల్లని గాలి వీచింది
మెల్లగ మేనును తాకింది
గంపెడు హాయినిచ్చింది
గుప్పెడు మనసు దోచింది

నల్లని మబ్బు లేచింది
సర్రున మెరుపు మెరిసింది
పెద్దగ ఉరుము ఉరిమింది
జోరుగ వాన కురిసింది

నిండుగ చెరువు నిండింది
దండిగ పంట పండింది
మెండుగ మోదం నింపింది
పండగ మదిలో తెచ్చింది

హెచ్చుగ దిగుబడి వచ్చింది
పచ్చగ బ్రతుకు మారింది
క్షామం పరుగులు తీసింది
క్షేమం నాట్యం చేసింది

- గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు.



చుక్కలు కలపండి

చిన్నారులూ, పప్పీకి బాలుతో ఆడుకోవాలని ఉంది. మరి ఆ బాల్ ఎక్కడ ఉందో చూపరూ!

నేను గీసిన బొమ్మ

శైలజ ,
6వ తరగతి,
జడ్పిహెచ్ఎస్ హవేలీ,
ఘనాపూర్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అబ్బారెడ్డి నాగేశ్వరరావు

చింతలపాటి వెంకటపతిరాజు

పసుపులేటి హనుమంతరావు

మెరిసిన తెలుగు 'పద్మా'లు

కళారంగానికి గుర్తింపు : 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలోని నాటు నాటు పాటకు సంగీతం సమకూర్చిన కారణంగా... ఇప్పుడు మార్మోగుతున్న పేరు కీరవాణి. ఈ పాట గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కించుకోవడంతో పాటు ఆస్కార్ నామినేషన్లలో నిలిచి చరిత్ర సృష్టించింది. ఈ సందడి ఇలా సాగుతుండగానే ఇప్పుడు కీరవాణికి 'పద్మ' పురస్కారం లభించింది. గుంటూరుకు చెందిన ప్రముఖ హరికథకుడు కోట సచ్చిదానందశాస్త్రి పురాణ, ఇతిహాసాలను హరికథా రూపంలో జనాకర్షకంగా చెప్పే సమర్థులు. తన గానంలో ఎన్నో సామాజిక రుగ్మతలను ఎత్తి చూపేవారు. ఒకప్పుడు ఆయన కథ వినడానికి ఎడ్లబండ్లు కట్టుకుని మరీ జనం వచ్చేవారు. 1960 నుంచి 1980 వరకు రేడియోలో వేల ప్రదర్శనలు ఇచ్చారు.

అనకాపల్లికి చెందిన చింతలపాటి వెంకటపతిరాజు ఏటికొప్పాక బొమ్మలకు గొప్ప గుర్తింపు తీసుకొచ్చారు. ఆ కళకు ఆధునిక హంగులూ, విస్తృత గుర్తింపూ తీసుకురావడంతో పాటు కళాకారులకు వెన్నుదన్నుగా నిలిచారు. బొమ్మల తయారీనే నమ్ముకున్న ఎంతోమంది కళాకారులు ఆదరణ లేక కూలి పనులకు వెళ్లడాన్ని చూసి హస్తకళా నిలయాన్ని ఏర్పాటుచేశారు. ఆధునిక బొమ్మల తయారీపై వారికి శిక్షణ ఇచ్చి బతుకుతెరువు చూపించారు. సత్యసాయి విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ప్రకాష్‌చంద్రసూద్ విద్యాబోధనతోపాటు పరిశోధన అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ప్రత్యేకంగా న్యూక్లియర్ ఫిజిక్స్ ఎడ్యుకేషన్ రంగంలో విశేషకృషి చేస్తున్నారు. దేశంలోని అత్యంత సీనియర్ అణుశాస్త్రవేత్తల్లో ఒకరు. వీరంతా పద్మశ్రీ పురస్కారంతో భారత ప్రభుత్వం గుర్తింపు పొందారు.



డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్

కె ఎన్ గణేశ్

బి రామకృష్ణారెడ్డి

శాస్త్ర పరిశోధనలో ... : ఆర్కిడ్ జాతి మొక్కలపై విశేష పరిశోధన చేసిన డాక్టర్ అబ్బారెడ్డి నాగేశ్వరరావుకు సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పద్మశ్రీ పురస్కారం వరించింది. ఆర్కిడ్ జాతికి చెందిన 35 రకాల మొక్కలను కనుగొన్న ఆయన ఈశాన్య రాష్ట్రాల్లో దశాబ్దాల పాటు సేవలందించారు. తిరుపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్) డైరెక్టర్ ప్రొఫెసర్ కె ఎన్ గణేశ్‌కు సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పద్మశ్రీ వరించింది. పుణె ఐసర్‌కు తొలి డైరెక్టర్‌గా పనిచేసిన గణేశ్ సైన్స్ రంగంలో విశేష కృషి చేసి ఎన్నో మైలురాళ్లు అధిగమించారు.

> **తెలుగు నాట 12 పద్మ పురస్కారాలు కాంతులీనాయి. వివిధ రంగాల్లో ఎంతోకాలంగా కృషి చేస్తున్న పలువురికి భారత ప్రభుత్వం తమ గుర్తింపును, గౌరవాన్ని ప్రకటించింది. వివిధ కళలను, కళాకారులను గుర్తిస్తూ; సేవారంగంలో.. కళారంగంలో.. వైద్య, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశేష కృషిని అభినందిస్తూ గణతంత్ర దినోత్సవ సందర్భంగా పద్మ అవార్డులు ప్రకటించారు. వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి 12 మంది ఎంపికైతే.. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడుగురు ఉన్నారు.**

సామాజిక సేవలో .. : ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ తన ఫౌండేషన్ ద్వారా విశేష సేవలు అందిస్తున్నారు. 1985లో జరిగిన ఓ విమాన ప్రమాదంలో భార్య పిల్లలను పోగొట్టుకున్న ఆయన కెనడాలో 22 ఏళ్లుగా చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి కాకినాడకు వచ్చారు. 'సంకురాత్రి ఫౌండేషన్', 'శారదా విద్యాలయం', 'శ్రీ కిరణ్ నేత్ర చికిత్సాలయం' పేరుతో 30 ఏళ్లుగా గ్రామీణ పేద విద్యార్థులకు ఉచిత విద్య, వృద్ధులకు కంటి వైద్యం అందిస్తున్నారు. 'ఈ పురస్కారం రావడం మా అందరికీ ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. ఇప్పటి వరకు మా ఫౌండేషన్ ద్వారా 37 లక్షల మందికి పైగా కంటివైద్యం అందించాం. 3.40 లక్షల మందికి కంటి శస్త్రచికిత్సలు చేయించాం. మా విద్యాలయం ద్వారా ఎంతోమంది పిల్లలు విద్య నేర్చుకుంటారు. వారంతా మంచి ఉద్యోగాలు చేస్తూ జీవితాల్లో స్థిరపడ్డారు. చాలా ఆనందంగా ఉంది' అంటున్నారు చంద్రశేఖర్.

తెలంగాణ నుంచి ...

వ్యవసాయ శాస్త్రవేత్తగా ఎన్నో ఆవిష్కరణలు చేసిన విజయగుప్తా సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో తెలంగాణ నుండి పద్మశ్రీ వరించిన వారిలో ఉన్నారు. నీలి విప్లవం ద్వారా తక్కువ ఖర్చుతో చేపల సాగు పెంచి ఎంతోమందిని ఆ రంగం వైపు నడిపించారు. కేంద్రం, ఉమ్మడి తెలుగు రాష్ట్రం, తెలంగాణ ప్రభుత్వ మత్స్యశాఖల సాంకేతిక సలహాదారుగా కూడా పనిచేశారు. పశ్చిమబెంగాల్ మత్స్యశాఖలో కూడా వివిధ హోదాలు నిర్వహించారు.

సాహిత్యం–విద్య రంగం నుంచి బి.రామకష్ణారెడ్డికి పద్మశ్రీ వరించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్‌గా పనిచేయడంతోపాటు గిరిజన భాషలైన కువి, మండలపై విస్తృత పరిశోధనలు చేసి గిరిజన భాషలను పునరుజ్జీవింపజేయడంలో ఆయన ఎంతో కృషి చేశారు. వైద్య రంగం నుండి హనుమంతరావు పసుపులేటికి పద్మశ్రీ లభించింది. పిల్లల వైద్యునిగా సేవలు అందిస్తూనే స్వీకార్ మల్టిస్పెషాలిటీ రిహాబిలిటేషన్ సెంటర్' ద్వారా శారీరక, మానసిక వైకల్య పిల్లలకు వైద్యం చేస్తూ 35కి పైగా జాతీయ, రాష్ట్ర, అంతర్జాతీయ పురస్కారాలు పొందారు. అలాగే చినజీయర్, కమలేష్ డి పటేల్‌కు పద్మ పురస్కారం లభించింది.

ఈ ఏడాది పద్మ పురస్కారాలు అందుకుంటున్న వారిలో ఎందరో ప్రముఖులు ఉన్నారు. గాయని వాణీ జయరాం, నటి రవీనాటాండన్, సుధా కృష్ణమూర్తి, మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఖాదరవలీ, తబలా విద్వాంసులు జాకీర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

ఎం ఎం కీరవాణి

విజయ్ గుప్తా

కోట సచ్చిదానంద శాస్త్రి



ప్రకాశ్ చంద్రసూద్

'రావణాసుర' గ్లింప్స్ వీడియో

మాస్ మహారాజా రవితేజ పుట్టినరోజు సందర్భంగా విషెస్ తెలియజేస్తూ మేకర్స్ 'రావణాసుర' గ్లింప్స్ వీడియో విడుదల చేశారు. భారీ భవంతిలో ఓ యువతిని ఎవరో కాల్చి చంపగా.. బ్లాక్ సూట్‌లో ఉన్న రవితేజ లోపలి నుంచి బయటకు వస్తున్నాడు. ఇంతకీ ఏం జరిగింది? అనేది సస్పెన్స్ లో పెడుతూ రిలీజ్ చేసిన గ్లింప్స్ వీడియో సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. యూనిక్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో వస్తోన్న ఈ చిత్రాన్ని సుధీర్ వర్మ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ చిత్రంలో అనూ ఎమ్మాన్యుయేల్, పూజిత పొన్నాడ, దక్షా నగార్కర్, ఫరియా అబ్దుల్లా, మేఘా ఆకాశ్ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. యువ నటుడు సుశాంత్ విలన్‌గా నటిస్తున్నాడు. అభిషేక్ పిక్చర్స్, రవితేజ టీమ్ వర్క్స్ బ్యానర్లపై తెరకెక్కిస్తున్న ఈ మూవీలో రావు రమేశ్, మురళీ శర్మ, సంపత్ రాజ్, నితిన్ మెహతా కీలక పాత్రలు పోషిస్తున్నారు.

దసరా ఊర మాస్ లుక్

న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న చిత్రం 'దసరా'. కాగా మేకర్స్ స్టన్నింగ్ ఊర మాస్ లుక్ ఒకటి విడుదల చేశారు. నాని బల్బు సెట్ చేసి ఉన్న చేతికర్రను చేతిలో పట్టుకుని.. బీడీ కాలుస్తూ రాజ్‌దూత్ బైక్‌పై కూర్చొన్న స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. శ్రీకాంత్ ఓదెల డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం మార్చి 30న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రంలో కీర్తిసురేశ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. సాయికుమార్, సముద్రఖని, జరీనా వహబ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు.

శర్వానంద్ నిశ్చితార్థం

యువ నటుడు శర్వానంద్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న రక్షితా రెడ్డితో ఆయనకు పెళ్లి నిశ్చయమైంది. గురువారం ఈ జంటకు నిశ్చితార్థం నిర్వహించారు. రక్షిత తెలంగాణ హైకోర్టు న్యాయవాది కుమార్తె. ఇరు కుటుంబసభ్యుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి చిరంజీవి, నాగార్జున, రామ్‌చరణ్, ఉపాసన, సిద్ధార్థ, శ్రీకాంత్, నానితో పాటు పలువురు నటీనటులు విచ్చేశారు. కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

'సైంధవ్'లో బాలీవుడ్ యాక్టర్



హీరో వెంకటేశ్ శైలేష్ కొలను దర్శకత్వంలో చేస్తున్న చిత్రం 'సైంధవ్'. ఈ సినిమాలో బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్దిఖీ కీలక పాత్రలో నటిస్తున్నట్టు తెలియజేస్తూ.. ఆయనతో దిగిన ఫొటోను షేర్ చేశాడు. ఇండియాలో ఉన్న వన్ ఆఫ్ ది బెస్ట్ యాక్టర్‌తో పనిచేయడం చాలా ఎగ్జయిటింగ్‌గా ఉందని శైలేష్ కొలను ట్వీట్ చేశాడు. కాగా సినిమాను రామానాయుడు స్టూడియోలో గురువారం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణ్ సంగీతం అందిస్తున్నాడు.

సునీత తనయుడి 'సర్కారు నౌకరి'

కె. రాఘవేంద్రరావు నిర్మాతగా ఆర్.కె టెలీ షో ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై గంగనమోని శేఖర్ దర్శకత్వంలో 'సర్కారు నౌకరి' చిత్రం ప్రారంభమైంది. గాయని సునీత తనయుడు ఆకాష్ ఈ చిత్రంలో హీరోగా పరిచయమవుతున్నాడు. నూతన నటి భావనా వళపండల్ హీరోయిన్‌గా కనిపించనుంది. తొలి సన్నివేశానికి కె.రాఘవేంద్రరావు క్లాప్ ఇచ్చారు. నిర్మాత ప్రసాద్ నిమ్మకాయల కెమెరా స్విచ్ఛాన్ చేయగా, గాయని సునీత, ఆమె భర్త రామ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 6 నుంచి ఈ సినిమా షూటింగ్ జరుగుతుందని చిత్ర బృందం తెలిపింది.

'సోదర సోదరీమణులారా' ఫస్ట్ లుక్

కమల్ కామరాజు, అపర్ణాదేవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'సోదర సోదరీమణులారా'. నూతన దర్శకుడు రఘుపతి రెడ్డి రచన, దర్శకత్వంలో మూవీస్ బ్యానర్లు సంయుక్తంగా విజయ్ కుమార్ పైండ్ల నిర్మిస్తున్న ఈ చిత్రం ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. 35 రోజుల్లో తెరకెక్కిన ఈ సినిమా ఫ్యామిలీ డ్రామాగా ప్రేక్షకులను అలరించనుంది. తాజాగా గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ చిత్ర బృందం ఫస్ట్ లుక్‌ను విడుదలచేసింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయనున్నారు.

ఫైనల్‌కు సబలెంక, రైబకినా

నేడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్.. ఆస్ట్రేలియన్ ఓపెన్

సబలెంక

రైబకినా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి కజకిస్తాన్‌కు చెందిన ఎలేనా రైబకినా, రష్యాకు చెందిన అర్యానా సబలెంకా ప్రవేశించారు. గురువారం జరిగిన సెమీస్‌లో ఎలేనా 7–6(7–4), 6–3తో రష్యాకు చెందిన విక్టోరియా అజరెంకాపై గెలుపొంది తొలిసారి ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఉత్కంఠభరితంగా సాగిన సెమీస్ పోటీలో రైబకినా 24వ సీడ్, బెలారస్‌కు చెందిన అజరెంకాపై గెలిచింది. 22వ సీడ్‌గా బరిలోకి దిగిన రైబకినా తొలి సెట్‌ను టై బ్రేక్‌లో గెలిచింది. రాడ్ లెవెర్ ఎరేనాలో జరిగిన సెమీస్‌లో కజకిస్తాన్ అద్భుత ప్రదర్శనను కనబర్చింది. మరో సెమీస్‌లో సబలెంకా 7–6(7–1), 6–2తో లినెట్టె(పోలండ్)పై నెగ్గింది. శనివారం జరిగే ఫైనల్లో సబలెంకా, రైబకినా టైటిల్‌కై తలపడనున్నారు.

ఖచనోవ్ X సిట్సిపస్ టామీ పాల్ X జకోవిచ్

హార్దిక్ కెప్టెన్సీకి పరీక్ష

రోహిత్, కోహ్లికి విశ్రాంతి.. న్యూజిలాండ్‌తో తొలి టి20 నేడు

రాత్రి 7.00గం.ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

టీమిండియా ఆటగాళ్లతో ముచ్చటిస్తున్న మాజీ కెప్టెన్ ధోనీ

రాంచీ: వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా ఇక టి20 సిరీస్‌పై దృష్టి సారించింది. సీనియర్ బ్యాటర్స్ రోహిత్ శర్మ, కోహ్లితో పాటు పేస్ బౌలర్లు సిరాజ్, షమీ, శార్దూల్ కూడా విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో యువ పేసర్లు అర్షదీప్, శివమ్ మావి, ఉమ్రన్‌పైనే టీమిండియా ఆశలున్నాయి. సుదీర్ఘ కాలం తర్వాత టి20 జట్టులో చోటు దక్కించుకున్న పృథ్వీ షా తుది జట్టులో చోటు దక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నాడు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో అదరగొట్టిన శుభ్‌మన్ గిల్ మరో ఓపెనర్‌గా బరిలోకి దిగడం ఖాయం. మూడు వన్డేల సిరీస్‌లో ఓ డబుల్ సెంచరీ, మరో సెంచరీ చేశాడు. ఇక సూర్యకుమార్ యాదవ్ ఈ ఫార్మాట్‌లో ఐసిసి ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉండడం మనకూ కలిసిరానుంది. శ్రీలంకతో జరిగిన మూడు టి20 సిరీస్‌కు టీమిండియా జట్టుకు సారథ్యం వహించిన హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. న్యూజిలాండ్‌తో స్వదేశంలో ఇప్పటివరకు జరిగిన టి20 సిరీస్‌లలో భారత్ 10 గెలిచి మరో 2 సిరీస్‌ను డ్రా చేసుకొంది. 2019 లో ఆస్ట్రేలియా చేతిలో చివరి సారిగా టీమిండియా ఈ ఫార్మాట్‌లో సిరీస్‌ను చేజార్చుకుంది. ఇక న్యూజిలాండ్‌పై టీమిండియాకు అద్భుతమైన ట్రాక్ రికార్డును కలిగి ఉండడం మనకు అనుకూలించనుంది. ఇక న్యూజిలాండ్ జట్టు విషయానికొస్తే.. ఈ ఫార్మాట్‌లోనైనా బోణీ కొట్టాలని చూస్తోంది. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇక లెఫ్ట్ ఆర్మ్ పేసర్ బెన్ లిస్టర్ అరంగేట్రం చేయనున్నాడు.

గైక్వాడ్‌కు గాయం

టీమిండియా యువ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్(25) మణికట్టుకు గాయమైంది. హైదరాబాద్‌తో జరిగిన రంజీ మ్యాచ్ సందర్భంగా మహారాష్ట్ర తరఫున ఆడుతున్న గైక్వాడ్ మణికట్టుకు గాయమైంది. దీంతో బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో కోలుకుంటున్నాడు. అతడి గాయంపై బిసిసిఐ ఇప్పటికి ఎలాంటి ప్రకటన చేయలేదు. గాయం తగ్గకపోతే న్యూజిలాండ్‌తో జరిగే టి20 సిరీస్‌కు దూరమైనట్లే.

ఇండియా జట్టు: హార్దిక్(కెప్టెన్), సూర్యకుమార్(వైస్ కెప్టెన్), ఇషాన్, శుభ్‌మన్, దీపక్ హుడా, త్రిపాఠి, జితేశ్ శర్మ, సుందర్, కుల్దీప్, చాహల్, అర్షదీప్, ఉమ్రన్, శివమ్ మావి, పృథ్వీ షా, ముఖేష్ కుమార్, గైక్వాడ్.

అదరగొట్టిన హాకీ జట్టు

జపాన్‌పై 8–0తో గెలుపు
హాకీ ప్రపంచకప్

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరడంలో విఫలమైన భారత హాకీ జట్టు వర్గీకరణ(స్థానాల)కు జరిగిన మ్యాచ్‌లో సత్తా చాటింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 8–0గోల్స్ తేడాతో జపాన్‌పై ఘన విజయం సాధించింది. తొలి రెండు క్వార్టర్స్ ముగిసే సరికి ఇరుజట్లు ఒక్క గోల్‌నూ నమోదు చేయని భారత్.. మూడు, నాలుగు క్వార్టర్స్‌లో నాలుగేసి గోల్స్ కొట్టింది. మూడో క్వార్టర్‌లో మన్‌దీప్ (33వ ని.), వివేక్ సాగర్(40వ ని.)తో పాటు అభిషేక్ రెండు గోల్స్ చేశాడు. ఇక నాల్గో క్వార్టర్ ప్రారంభంలోనే 46వ ని.లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఒక గోల్ చేయగా.. మ్యాచ్ మరో 2నిమిషాల్లో ముగుస్తుందనగా వరుసగా మూడు గోల్స్ చేసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ రెండు, మన్‌ప్రీత్, సుఖ్‌జీత్ ఒక్కో గోల్ చేశారు. శనివారం 9–12స్థానాలకు జరిగే వర్గీకరణ పోటీలో భారతజట్టు దక్షిణాఫ్రికాతో తలపడనుంది.

క్వార్టర్స్‌కు లక్ష్యసేన్

జకార్తా: ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి యువ షట్లర్ లక్ష్యసేన్ దూసుకెళ్లాడు. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో లక్ష్యసేన్ 19–21, 21–8, 21–17 తేడాతో ఎన్‌జి టియంగ్(మలేషియా)పై పోరాడి నెగ్గాడు. క్వార్టర్స్‌లో జొనాథన్ క్రిస్టీతో తలపడనున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ పోరాటం ముగిసింది. ప్రి క్వార్టర్స్‌లో సైనా 15–21, 17–21తో కేవలం 29 నిమిషాల్లోనే హన్–యు(చైనా) చేతిలో ఓడింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68